

స్థలం కబ్జా చేసి నిర్మించిన ప్రహరీ

దర్జాగా కబ్జా

దారిలేక ఇబ్బంది పడుతున్న ప్రజలు

న్యాయం కోసం అధికారులకు వినతి

కొండాపురంలో గ్రామకంఠం సమస్య

పెనుకొండ టౌన్, జూలై 26(ఆంధ్రజ్యోతి): వైసీపీ నాయకులు కొందరు రెవెన్యూ అధికారులను లోబరుచుకుని 40 సెంట్ల ప్రభుత్వ స్థలాన్ని కబ్జా చేసి, తమకు దారి లేకుండా చేశారని కొండాపురం గ్రామానికి చెందిన కొందరు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. కొండాపురం గ్రామం సర్వేనంబరు 708లో ఆరెకరాల గ్రామకంఠం భూమి ఉంది. ఈ భూమిలో పేదలకు 1995లో ఇళ్ల పట్టాలు ఇచ్చారు. మిగిలిన భూమిని వైసీపీ సానుభూతిపరులు తమ ఆధీనంలో ఉంచుకుని కొంత భూమికి పదేళ్ల కిందట వారి బంధువుల పేరిట ఇంటి పట్టాలు చేయించుకున్నారు. మిగిలిన భూమిని రెండు నెలల కిందట కబ్జా చేసి ప్రహరీ నిర్మించి, పూర్వం నుంచి ఉన్న రస్తాని మూసివేశారు. దీంతో ఆరు కుటుంబాలకు రాకపోకలు లేకుండా పోయింది. బాధితులు ఫిర్యాదు చేసి 15రోజులు గడుస్తున్నా తహసీల్దార్ పట్టించుకోకపోవడంపై ఆరోపణలు వ్యక్తం అవుతున్నాయి. సమస్యపై ఉన్నతాధికారులకు సమాచారం అందించి, చర్యలు తీసుకోవాల్సిన తహసీల్దార్, ఆర్ఐ, కార్యాలయానికే పరిమితమయ్యారనే విమర్శలు వ్యక్తం అవుతున్నాయి. అయితే గ్రామకంఠం భూమితో తమకు సంబంధం లేదని తహసీల్దార్ స్వాతి అన్నారు. ఇది నగర పంచాయతీ అధికారులు చూసుకోవాల్సిన అంశం అన్నారు. తాము సర్వేచేసి ఎంత స్థలం కబ్జా అయ్యిందో చెబుతామేగాని గ్రామకంఠంలో నిర్మాణాలు తొలిగించే అధికారం లేదన్నారు.

గ్రామం వదిలి వెళ్లే పరిస్థితి : నాగలక్ష్మి, కొండాపురం




రాకపోకలు ఉన్న దారిని కొందరు కబ్జా చేసి కాంపౌండ్ వాల్ నిర్మించారు. ప్రస్తుతం రైల్వేకు సంబంధించిన భూముల నుంచి రాకపోకలు కొనసాగిస్తున్నాం. రైల్వే అధికారులు కూడా కట్టడి చేస్తే దారిలేక గ్రామం, ఇంటిని వదిలివెళ్లే పరిస్థితి ఉంది. పట్టణంలో ఇంటి అద్దెలు కట్టలేక ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

దారి అడిగితే బెదిరిస్తున్నారు: ప్రవీణ్‌రెడ్డి, కొండాపురం



40 సెంట్లు కబ్జా చేసి ఆరు కుటుంబాలకు దారి లేకుండా చేశారు. ఇప్పటికే ఆర్డీఓ, తహసీల్దార్‌లకు ఫిర్యాదు చేశాం. ఇంతవరకు స్పందించలేదు. మంత్రి సవిత మాకు న్యాయం చేయాలి. దారి వదలమని అడిగితే బెదిరిస్తున్నారు. మాకు న్యాయం చేయాలి.

చర్యలు తీసుకుంటాం: ఆనంద్‌కుమార్, ఆర్డీఓ



ప్రభుత్వ భూములు కబ్జా చేస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటాం. రికార్డులు పరిశీలించి దారి ఏర్పాటు చేస్తాం. సర్వేచేయించి ప్రభుత్వ భూముల్లో నిర్మాణాలు చేసిన వారిపై రెవెన్యూ చట్టం ప్రకారం చర్యలు తీసుకుంటాం. అక్రమ కట్టడాలని తెలిస్తే వాటిని తొలగిస్తాం.

టమోటా ధరహాసం

- వాతావరణ మార్పులతో మరింత పెరిగే చాన్స్
- మరికొన్ని రోజులు ఇవే ధరలు.. అన్నదాతలు



నిలకడగా ధరలు...ఆనందంలో రైతులు

గత 20 రోజులుగా టమోటా ధరలు నిలకడగా ఉండటంతో రైతులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. మండల వ్యాప్తంగా సీజన్‌తో సంబంధం లేకుండా వందల ఎకరాల్లో రైతులు టమోటా పంట సాగు చేస్తారు. ఎప్పుడూ నష్టాలే వస్తున్నా, ఏడాదిలో ఒక్కసారైనా రైతులకు అనుకూలమైన ధర వస్తుంది. దీంతో టమోటా సాగు చేయడానికి రైతులు మొగ్గు చూపుతారు. ఒక ఎకరం సాగు చేయడానికి కూలీలు, మందులు, ఎరువులు, కట్టెలు, ఇతర అవసరాల కోసం రూ.1.5 లక్షల నుంచి రూ.2.2 లక్షల వరకు పెట్టుబడి అవుతుంది. ధర బాగుంటే టమోటాలను మార్కెట్‌కు తరలిస్తారు. లేకుంటే తోటల్లోనే వదిలేయడం ఇక్కడ సర్వసాధారణం. గత పది నెలలుగా టమోటాలకు ధర లేకపోవడంతో మండలంలోని వివిధ గ్రామాల రైతులు రూ.కోట్ల పెట్టుబడి నష్టపోయారు.



చీకటిమానుపల్లివద్ద సాగుచేసిన టమోటా పంట



మార్కెట్‌కు తరలించడానికి సిద్ధంగా ఉన్న టమోటా బాక్సులు

తనకల్లు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): గత కొన్ని రోజులుగా టమోటా ధరలు నిలకడగా ఉన్నాయి. అన్నమయ్య జిల్లాలోని మొలకలచెరువు, అంగళ్లు, మదనపల్లి, కర్ణాటకలోని చింతామణి, కోలార్, వడ్డిపల్లి, ఇతర ప్రాంతాల్లో టమోట ధరలు నిలకడగా కొనసాగుతున్నాయి. ప్రస్తుతం అన్నమయ్యజిల్లా మొలకచెరువులో 30కిలోల బాక్సు రూ.900, మదనపల్లిలో రూ.వెయ్యి, అంగళ్లలో రూ.1100 నాణ్యతను బట్టీ ధర పలుకుతున్నాయి. కర్ణాటకలోని కోలార్‌లో 15 కిలోల బాక్సు రూ.470, చింతామణిలో రూ.430, వడ్డిపల్లిలో రూ.470 ఉన్నట్లు రైతులు చెబుతున్నారు. ఈ ధరలు సెప్టెంబరు దాకా కొనసాగవచ్చని రైతులు అభిప్రాయపడుతున్నారు. గత నాలుగైదు రోజులుగా కొనసాగుతున్న వర్షాల వల్ల ఇతర రాష్ట్రాలో టమోటా పంట దెబ్బతినే అవకాశాలున్నట్లు తెలుస్తోంది. ఈకారణంగా ధరలు మరింత పెరిగే అవకాశాలున్నట్లు సమాచారం. దిగుబడులు తక్కువగా ఉన్న నేపథ్యంలో ఇతర రాష్ట్రాల వ్యాపారులు కూడా పంట కొనుగోలుకు వస్తుండటంతో ధరలు మరింత పెరుగుతాయని రైతులు అంచనా వేస్తున్నారు.

14 ఎకరాల్లో పంట ఉంది



టమోటా ధరలు ఆశాజనంగా ఉన్నాయి. నేను 14 ఎకరాల్లో టమోటా సాగు చేశా. ప్రస్తుతం దిగుబడి ప్రారంభం అయ్యింది. ధరలు ఇలాగే కొనసాగితే మంచి ఆదాయం వచ్చే అవకాశాలున్నాయి. ప్రస్తుతమున్నవాతావరణంలో పంటను కాపాడుకోవడానికి ప్రాధాన్యం ఇస్తున్నా. లాభనష్టాలతో సంబంధం లేకుండా టమోటా సాగు చేస్తే ఒకసారి నష్టం వచ్చినా, మరోసారి ఆ నష్టాన్ని అధిగమించి లాభాలు పొందవచ్చు

- కోటిరెడ్డి, రైతు, చీకటిమానుపల్లి

చీడపీడలతో ఆందోళన

ప్రస్తుతం ఉన్న మబ్బులతో కూడిన చల్లని వాతావరణం వల్ల టమోటా పంటకు చీడపీడలు ఆశించే అవకాశం ఎక్కువగా ఉంది. దీంతో టమోటాలకు మచ్చలు ఎక్కువగా ఏర్పడే ప్రమాదం ఉంది. అలాగే తెగుళ్లు వచ్చే అవకాశాలు పెరిగాయి. దీనికి ఊజీ తోడైతే పంటలో మరిన్ని నష్టాలు జరిగే ప్రమాదం ఉంది. ధరలు ఆశాజనకంగా ఉన్న ప్రస్తుత తరుణంలో టమోటా పంటను కాపాడుకోవడానికి రైతులు నానా తంటాలు పడుతున్నారు.

ఈ ధరలతో మంచి ఆదాయం



ప్రస్తుతం టమోటాకు మంచి ధరలు ఉన్నాయి. దీంతో రైతులకు మంచి ఆదాయం వస్తోంది. ఈ ధరలు ఇలాగే కొనసాగితే గతంలో వచ్చిన నష్టాన్ని కూడా పూడ్చుకోవచ్చు. పురుగులు, తెగుళ్లబారి నుంచి పంటను కాపాడుకోవడానికి ఆర్గానిక్ పద్ధతుల్లో మందులు తయారు చేసి పిచికారీ చేస్తున్నా. చింతామణి మార్కెట్‌లో నా పొలంలో పండిన టమోటాలే టాప్ రేట్ పలుకుతున్నాయి. రైతులు క్రిమి సంహారక మందులు, పురుగుమందుల వినియోగం తగ్గించాలి.

- సుధాకర్‌రెడ్డి, రైతు, కొత్తకురవపల్లి

ఆకట్టుకున్న నృత్యం



పుట్టపర్తి, జూలై 26(ఆంధ్రజ్యోతి): బాలవికాస్ చిన్నారులు సంగీత నృత్యంతో భక్తులను ఆకట్టుకున్నారు. చెన్నై భక్తులు పర్తియాత్రతో శనివారం ప్రశాంతి నిలయానికి చేరుకున్నారు. సాయంత్రం సాయికుల్వంతు సభామండపంలో బాలవికాస్ చిన్నారులు సత్యసాయి ప్రేమతత్వంపై సంగీత నృత్యాన్ని ప్రదర్శించారు. గంట పాటు మధుర గానం, నృత్యంతో భక్తులను అలరింపచేశారు. అనంతరం సత్యసాయి మహాసమాధిని దర్శించుకున్నారు.

అరచేతిలో పురసేవలు

6

31న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడి రాక

- పర్యటనను విజయవంతం చేద్దాం: జీఎం శేఖర్



మాట్లాడుతున్న జీఎం శేఖర్

ధర్మవరం, జూలై 26(ఆంధ్రజ్యోతి): బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ ఈనెల 31న సత్యసాయి జిల్లాకు వస్తున్నారని, ఆయన పర్యటనను విజయవంతం చేయాలని ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు జీఎం శేఖర్ పిలుపు నిచ్చారు. శనివారం స్థానిక ఎన్డీఏ కార్యాలయంలో ఆయన ధర్మవరం నియోజకవర్గానికి చెందిన పార్టీ మండల అధ్యక్షులు, ముఖ్యనాయకులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శేఖర్ మాట్లాడుతూ.. బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు పీవీఎన్ మాధవ్ జిల్లాకు మొదటిసారిగా వస్తున్నారని, పర్యటనను సమష్టిగా విజయవంతం చేయాలని తెలిపారు. రాష్ట్ర అధ్యక్షుడి పర్యటన ద్వారా జిల్లాలో పార్టీని బలోపేతం చేసుకుందామని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు అంబటి సతీశ్‌కుమార్, సుదర్శన్, ఉత్తమ్‌రెడ్డి, సాకే ఓబులేసు, జింకా చంద్ర, చంద్ర పాల్గొన్నారు.

పెండింగ్ జీతాలు చెల్లించాలి

- యూటీఎఫ్ నేతల డిమాండ్
- డీఈఓ కార్యాలయం వద్ద ధర్నా



నిరసన తెలుపుతున్న యూటీఎఫ్ నాయకులు

కొత్తచెరువు, జూలై 26(ఆంధ్రజ్యోతి): పెండింగ్ జీతాల సమస్యను వెంటనే పరిష్కరించాలని యూటీఎఫ్ నాయకులు శనివారం స్థానిక డీఈఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా యూటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ.. విద్యాసంవత్సరం ప్రారంభం నాటి నుంచి ఉపాధ్యాయులు బోధనకంటే బోధనేతర పనులకే ఎక్కువ సమయం కేటాయించాల్సి వస్తోందని మండి పడ్డారు. యోగాంధ్ర, మెగా పేరెంట్స్ మీటింగ్, శిక్షణ తరగతుల పేరుతో అనేక కార్యక్రమాలు చేపడుతున్నారని, వీటిని ఉపాధ్యాయులతో చేయించరాదన్నారు. బదిలీలు జరిగి రెండు నెలలు కావస్తున్నా దాదాపు 25వేల మంది ఉపాధ్యాయులకు ఇప్పటికి రెండునెలల జీతాలు అందకపోవడంతో ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు. ఉపాధ్యాయుల సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు. అనంతరం ఏడీకి వినతి పత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా గౌరవ అధ్యక్షుడు భూతన్న, ప్రధాన కార్యదర్శి ఎం.సుధాకర్, నాయకులు జీహెచ్ బాబు, శ్రీనివాసులు, తహీర్‌వలి, లక్ష్మీనారాయణ, శివశంకర్, క్రిష్టప్ప, రామాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

విహార యాత్రలతో విజ్ఞానం

- జిల్లా సైన్స్ అధికారి తనూజ్ కుమార్



విహార యాత్రలో విద్యార్థులు

కొత్తచెరువు, జూలై 26(ఆంధ్రజ్యోతి): విహార యాత్రలతో విద్యార్థులకు విజ్ఞానం కలుగుతుందని, ప్రభుత్వం కల్పించే అవకాశాలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా సైన్స్ అధికారి తనూజ్ కుమార్ తెలిపారు. సమగ్రశిక్ష ఆధ్వర్యంలో శనివారం జిల్లాలోని 32 పాఠశాలల నుంచి 169 మంది విద్యార్థులు, 37 మంది ఉపాధ్యాయులకు ఒక్కరోజు విజ్ఞాన, విహార యాత్ర నిర్వహించారు. వీరికి పుట్టపర్తిలోని చైతన్యజ్యోతి మ్యూజియం, ప్రశాంతినిలయంలోని బాబాసమాధి, కొండమీద ఉన్న మ్యూజియం, ప్లానిటోరియం చూపించారు. కార్యక్రమంలో ఏఎంఓ అబ్దుల్‌మాలిక్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

- వెంకట రమణా.. శ్రీరామా..!



శ్రావణ మాసం మొదటి శనివారాన్ని పురస్కరించుకుని హిందూపురంలోని పేట వెంకటరమణస్వామిని ఇలా కోదండ రాముడిగా అలంకరించారు. ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారి దర్శనానికి పెద్ద ఎత్తున భక్తులు తరలివచ్చారు. ప్రాకారోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు.

- ఆంధ్రజ్యోతి, హిందూపురం

తమ్ముళ్ల తంటాలు..!

- ఉపాధి హామీలో అక్రమాల మాఫీకి అగచాట్లు
- ప్రజాప్రతినిధులతో అధికారులపై తీవ్ర ఒత్తిడి
- ఫీల్డు, టెక్నికల్ అసిస్టెంట్లతో అధికారుల వసూళ్లు ?
- తూతూ మంత్రపు విచారణతో ముగించే యత్నం



ఈనెల 22న 'తమ్ముళ్లు ఏమిటిది..?' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ప్రచురితమైన కథనం

పుట్టపర్తి టౌన్, జూలై 26(ఆంధ్రజ్యోతి): ఉపాధి హామీ పనుల్లో జరిగిన అవినీతిని కప్పిపుచ్చుకునేందుకు అక్రమార్కులు ఆపసోపాలు పడుతున్నారు. జిల్లాలో ఉపాధి హామీ పనుల్లో జరుగుతున్న అక్రమాలపై మంగళవారం 'తమ్ముళ్లు ఏమిటిది..?' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో కథనం ప్రచురితమైన విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో అక్రమాలపై రెండు రోజుల నుంచి అధికారులు విచారణ చేస్తున్నారు. ఫీల్డు, టెక్నికల్ అసిస్టెంట్లను సంబంధిత కార్యాలయాలకు పిలిపించుకుని అక్రమ బిల్లులపై ఆరాతీస్తున్నారు. ఎక్కడ అవినీతి జరిగిందన్న విషయంపై అధికారులు లోత్తగా విచారణ చేపట్టారు. దొంగ మస్టర్లతో ఉపాధి హామీ పనికి వెళ్లకుండానే బిల్లులు స్వాహా చేసిన నాయకులు తమ బాగోతం బయటపడకుండా ఉండేందుకు కొంతమంది ప్రజాప్రతినిధులతో అధికారులపై తీవ్రస్థాయిలో ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. దీంతో తూతూ మంత్రంగా చర్యలు తీసుకుని అక్రమార్కులను వదిలివేయడానికి విచారణాధికారులు నివేదికలు సిద్ధం చేసినట్లు సమాచారం.

ఫీల్డు అసిస్టెంట్ల తిరుగుబాటు

నాయకుల మాటలు నమ్మి అడ్డదిడ్డంగా బిల్లులు చేసిన ఫీల్డు అసిస్టెంట్లు ప్రస్తుతం అడ్డంగా ఇరుక్కుపోయారు. జరిగిన అక్రమాలకు కొంతమంది ఫీల్డు అసిస్టెంట్లను బాధ్యులను చేస్తూ అధికారులు చర్యలు తీసుకోవడానికి సిద్ధమైనట్లు తెలిసింది. దీంతో కొందరు ఫీల్డు అసిస్టెంట్లు తిరుబాటు చేసినట్లు సమాచారం. నాయకులు తమను నమ్మించి గొంతుకోశారని బుక్కపట్నం మండలానికి చెందిన కొంతమంది ఫీల్డు అసిస్టెంట్లు వాపోయినట్లు తెలిసింది. దొంగ మస్టర్లతో చేసిన బిల్లుల సొమ్మును ఓ టెక్నికల్ అసిస్టెంట్ ద్వారా నాయకులు పంచుకున్నారని, తాము తీసుకున్నది ఏమీలేదని వారు అధికారుల వద్ద చెప్పినట్లు సమాచారం. ఓ ఫీల్డు అసిస్టెంట్ తాను ఎవరికి ఎంత డబ్బు ఇచ్చింది లెక్కలు చెప్పడంతో అధికారులు ఖంగుతిన్నారు. ఈ నేపథ్యంలో తమ బాగోతం కూడా బయటపడుతుందన్న అనుమానంతో విచారణను నీరుగార్చడానికి తప్పుడు నివేదికలు సిద్ధం చేసినట్లు తెలిసింది.

అక్రమాలను కప్పిపుచ్చడానికి వసూళ్లు

జిల్లాలో ఉపాధి హామీ పథకంలో జరుగుతున్న అక్రమాలను 'ఆంధ్రజ్యోతి' వెలుగులోకి తీసుకువచ్చిన నేపథ్యంలో వాటిని కప్పిపుచ్చ డానికి ఓ జిల్లా అధికారి, కొంతమంది మండలస్థాయి అధికారులు వసూళ్లకు దిగినట్లు ఆరోపణలు వినిపిస్తున్నాయి. అక్రమాలకు పాల్పడిన ఫీల్డు, టెక్నికల్ అసిస్టెంట్లను గుర్తించి వారి నుంచి భారీ మొత్తంలో సొమ్ము వసూలు చేసినట్లు సమాచారం. మీపై కఠిన చర్యలు తీసుకోకుండా ఉండాలంటే చెప్పిన మొత్తంలో చెల్లించాలని బెదిరిస్తున్నట్లు సమాచారం. ఓ ఫీల్డు అసిస్టెంట్ తన వద్ద డబ్బులేదని చెప్పినా వినకుండా, బంగారం కుదువ పెట్టించి, రూ.1.5లక్షలు వసూలు చేసినట్లు ఆరోపణలున్నాయి.

విచారణ జరుగుతోంది

జిల్లాలో పలు ప్రాంతాల్లో ఉపాధి హామీ పథకంలో జరిగిన అక్రమాలపై క్షేత్రస్థాయిలో విచారణ జరుగుతోంది. సంబంధిత ఎంపీడీఓ, ఉపాధి పథకం అధికారులు సంయుక్తంగా విచారణ చేస్తున్నారు. అధికారుల తుది నివేదిక ఆధారంగా బాధ్యులపై చర్యలు తీసుకుంటాం.

- విజయేంద్రప్రసాద్, పీడీ, డ్వామా

సెక్టోరల్స్ ఎంపికకు అడుగులు

అనంతపురం ఎస్ఎస్ఏలో ఖాళీల భర్తీకి చర్యలు

శ్రీసత్యసాయి జిల్లాలో దరఖాస్తుల ఆహ్వానం



జిల్లా సమగ్రశిక్ష కార్యాలయం

అనంతపురం విద్య/కొత్తచెరువు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా సమగ్రశిక్షలో ఏడాదిగా ఖాళీగా ఉన్న కీలకమైన సెక్టోరల్స్ పోస్టుల భర్తీకి అధికార యంత్రాంగం అడుగులు వేస్తోంది. గత జూన్‌లో ఆరు సెక్టోరల్స్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ ఇచ్చారు. వీటికి 171 మంది దరఖాస్తు చేసుకున్నారు. అయితే నియామకాలను యంత్రాంగం పట్టించుకోలేదు, పైగా కొందరు టీచర్లను డెప్యుటేషన్ వేసుకున్నారు. దరఖాస్తులు స్వీకరించి నెలరోజులు కావస్తున్నా నియామకాలు జరపకపోవడంపై 'ఆంధ్రజ్యోతి'లో ప్రత్యేక కథనాలు ప్రచురితమయ్యాయి. దీంతో ఎస్ఎస్ఏ అధికారులు సెక్టోరల్స్ నియామకాలకు అడుగులు వేస్తున్నారు. అందులో భాగంగా ఇదివరకే వచ్చిన దరఖాస్తులను పరిశీలించడానికి పది మందితో కమిటీని నియమించారు. అనంతపురం, గుత్తి డివిజన్‌ల డిప్యూటీ డీఈఓ మల్లారెడ్డి, గార్లదిన్నె ఎంఈఓ వెంకటరమణనాయక్, బుక్కరాయసముద్రం ఎంఈఓ లింగానాయక్, శ్రీనివాసరావు, హైస్కూల్ హెచ్ఎంలు శ్రీనివాసులు (పాలవెంకటాపురం), ఎర్రిస్వామి (గుండ్లపల్లి), రోషన్‌బాషా (వేపులపర్తి), ప్రహ్లాదనాయుడు (శింగానహళ్లి) పీఆర్వీ ప్రసాద్ (రాప్తాడు) లక్ష్మీశిరీషా (వెంకటాద్రిపల్లి)లను నియమించారు. ఈమేరకు ఎస్ఎస్ఏ ఏపీసీ శైలజ ఉత్తర్వులు ఇచ్చారు. ఈ కమిటీ సెక్టోరల్ పోస్టుల వారీగా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి, నిబంధనల మేరకు అర్హుల జాబితా తయారు చేస్తారు. అర్హత సాధించిన (మిగతా 6లో...)

● కుక్క బతుకు..!



ఎట్లబ్బా దాటేదీ..! తగిలైతే సచ్చి ఊరుకుంటా..!



ఓ సారూ.. రొంత రోడ్డు దాటిచ్చి పుణ్యం కట్టుకుంటారా..? కుంటిదాన్ని..



కొంచెం ఆగు.. అందిరినీ ఆపేస్తాను..



భయపడాకు.. నేనున్నా కదా.. నెమ్మదిగా దాటుకో..



థ్యాంక్సు సారూ.. ముందరుండి దాటిస్తాండావు..! నీ పెండ్లాం పిల్లోళ్లు సల్లగుండల్ల..!



ఇదిగో.. అక్కడ ఫుట్‌పాత్ ఎక్కు.. ఇంగేం భయం లేదు..!



ఓ సారూ.. పోతాండావా..? ఆకలైతాంది.. తిన్నీకి ఏమైనా కొనీగుడుదూ..!



ఇంటికాడైతే కడుపు నిండా బువ్వ పెడుదును..! ఇదిగో.. బిస్కెట్లు తిను..!



దిష్టి తగిలీని సామీ.. అట్ల సూత్తాండారూ..!

(అనంతపురం నగరంలోని శ్రీకంఠం సర్కిల్‌లో తచ్చాడుతూ ఉంటుంది ఈ వీధి శునకం. ఏదో వాహనం ఢీకొని దీని వెనక కాళ్లు రెండూ సచ్చుపడిపోయాయి. ఆకలి తీర్చుకునేందుకు రోడ్డు దాటుతూ.. ట్రాఫిక్‌లో నిత్యం వాహనాలకు అడ్డొస్తుంటుంది. ట్రాఫిక్ పోలీసులు ఇలా సాయం చేశారు)

- స్టాఫ్ ఫొటోగ్రాఫర్, ఆంధ్రజ్యోతి, అనంతపురం

అరచేతిలో పురసేవలు

● పురమిత్రతో మొబైల్ నుంచే అన్ని వ్యవహారాలు ● అందుబాటులోకి 150 రకాల సేవలు

ధర్మవరం, జూలై 26(ఆంధ్రజ్యోతి): ప్రజల చెంతకే పరిపాలనను తీసుకువచ్చేందుకు కూటమి ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. ఇప్పటికే వాట్సాప్ గవర్నెన్స్ పేరుతో పలు రకాల సేవలను ప్రజల చేతిలోకి తెచ్చింది. పురపాలక సేవలను కూడా పౌరుల చెంతకు తెచ్చేందుకు చర్యలు చేపట్టింది. పట్టణాలు, నగరాల్లో ఉండే ప్రజలకు పౌరసేవలను సులభతరం చేయడం కోసం సేవామిత్ర మాదిరిగా పురమిత్ర యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. పట్టణ వాసులు పౌర సేవల కోసం మున్సిపల్ కార్యాలయాల చుట్టూ రోజుల తరబడి తిరగాల్సివస్తోంది. నగరాల్లో ఈ పరిస్థితి మరింత ఇబ్బందికరంగా ఉంటుంది. మున్సిపాలిటీలకు పన్నులు కట్టాలన్నా, చార్జీలు చెల్లించాలన్నా, ఏదైనా సమస్యపై ఫిర్యాదు చేయాలన్నా గంటల తరబడి క్యూలైన్లలో వేచి ఉండాలి. వార్డు సచివాలయాలు వచ్చిన తరువాత వారంతా స్థానిక సచివాలయాల దగ్గరకు వెళుతున్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బంది లేకుండా రాష్ట్ర మున్సిపల్ శాఖ పురమిత్ర యాప్‌ను అందుబాటులోకి తెచ్చింది. ఈ యాప్ ద్వారా అనేక రకాల డిజిటల్ సేవలు అందుబాటులోకి తెచ్చింది.



రోజుల వ్యవధిలోనే పరిష్కారం

రోజుల వ్యవధిలోనే సమస్యల పరిష్కారమయ్యేలా అధికారులు చర్యలు తీసుకుంటారు. సమస్యను పంపేందుకు యాప్‌లో ఫీచర్స్ కూడా పొందుపరిచారు. మనచుట్టూ ఉన్న సమస్యను ఫొటో తీసి, వాయిస్ రికార్డుతో టైప్ చేసి పంపించే విధంగా యాప్‌ను రూపొందించారు. పంపిన సమస్య.. సమాచారం నేరుగా సంబంధిత విభాగాధికారికి వెళుతుంది. పరిష్కారం చూపేందుకు కనీసం మూడు నుంచి 15 రోజులు లేదా 30 రోజుల వ్యవధి నిర్ణయించారు. సమస్య తీవ్రత బట్టి పరిష్కారం చూపిస్తారు.

యాప్‌ను ఎలా ఇన్‌స్టాల్ చేసుకోవాలంటే..

స్మార్ట్ ఫోన్ వాడేవారు గూగుల్ ప్లే స్టోర్‌లోకి వెళ్లి పురమిత్ర అని టైప్ చేస్తే యాప్ ప్రత్యక్షమవుతుంది. దాన్ని మొబైల్‌లోకి ఇన్‌స్టాల్ చేసుకోవాలి. ఆ తరువాత ఓపెన్ బటన్ క్లిక్ చేసి యాప్‌ను ఓపెన్ చేసుకోవాలి. మున్సిపాలిటీ, కార్పొరేషన్‌ను ఎంపిక చేసుకోవాలి. వాటి పరిధిలోని సచివాలయాన్ని ఎంచుకోవాలి. ఆ తరువాత పేరు మొబైల్ నంబర్ ఎంటర్ చేయాలి. ఎంటర్ చేసిన మొబైల్ నంబర్‌కు ఓటీపీ వస్తుంది. ఆ ఓటీపీని ఎంటర్ చేస్తే యాప్‌లో సేవలకు సంబంధించిన ఆప్షన్లు కనిపిస్తాయి. పబ్లిక్ హెల్త్, మొదలు రెవెన్యూ సేవల వరకూ 8 విభాగాలు కనిపిస్తాయి. మన సమస్య ఏ విభాగానికి సంబంధించినదో.. ఆ విభాగాన్ని టచ్ చేస్తే అందులో పలు రకాల సేవలకు సంబంధించిన ఆప్షన్స్ కనిపిస్తాయి. వాటిని క్లిక్ చేసి మన సమస్యను ప్రభుత్వానికి తెలియజేయవచ్చు.



మున్సిపల్ కార్యాలయం

యాప్‌ను సద్వినియోగం చేసుకోండి

మున్సిపాలిటీలో ప్రభుత్వం పురమిత్రయాప్‌ను తీసుకువచ్చింది. ప్రజలు ఈ యాప్‌ను స్మార్ట్‌ఫోన్‌లో ఇన్‌స్టాల్ చేసుకుని దాని ద్వారా సమస్యను తెలపవచ్చు. ఏ సమస్యపై ఫిర్యాదు చేస్తారో అది నేరుగా సంబంధిత అధికారుల వద్దకు చేరుతుంది. దీంతో సమస్యను పరిష్కరిస్తాం. ఇప్పటికే సచివాలయాల్లో ఈ యాప్‌పై ప్రచారం చేశాం. ప్రజలు ఈ యాప్‌ను సద్వినియోగం చేసుకోవాలి.

- రాజేశ్వరి, మేనేజర్, ధర్మవరం మున్సిపాలిటీ

యాప్‌ద్వారా 150 సేవలు

పురమిత్ర యాప్ ద్వారా మొత్తం 150 సేవలు అందుబాటులో తెస్తున్నారు. రెవెన్యూ, ప్రజారోగ్యం, టౌన్‌ప్లానింగ్, ఇంజనీరింగ్, అకౌంట్స్, అడ్మినిస్ట్రేషన్ విభాగాలకు సంబంధించిన 150 రకాల సేవలు అందుబాటులోకి తెచ్చారు.

● పన్ను చెల్లింపులు, కుళాయి చార్జీల చెల్లింపులు, జనన, మరణ, ధ్రువీకరణ పత్రాల దరఖాస్తులు, వివాహ ధ్రువీకరణ పత్రాలకు దరఖాస్తు చేసుకునే సదుపాయం ఈ యాప్‌లో కల్పించారు.

● తమ ఆవాసాల వద్ద ప్రజలు ఎదుర్కొనే రోజువారీ సమస్యలపై అధికారులకు ఎప్పటికప్పుడు ఫిర్యాద చేయవచ్చు. తాగునీటి సమస్య, విద్యుత్ అంతరాయాలు, పారిశుధ్య నిర్వహణ, డ్రైనేజీ, రహదారుల సమస్యలపై ప్రభుత్వానికి ఫిర్యాదు చేసే సదుపాయం ఉంది.

● పారిశుధ్య నిర్వహణకు సంబంధించి దోమలు, వీధికుక్కలు, శ్మశాన వాటికలు, బయో, మెడికల్ వ్యర్థాల తొలగింపు, వీధులను శుభ్రంచేయకపోవడం, గుర్తుతెలియని మృతదేహాలు, సామూహిక మరుగుదొడ్ల నిర్వహణ, రోడ్ సైడ్ ఆహార కల్తీ, గార్బేజ్ బిన్‌ల ఏర్పాటు, చెత్త తొలగింపు వంటి మొత్తం 53 రకాల సేవలు అందుబాటులో ఉంచారు.

● టౌన్‌ప్లానింగ్ విభాగానికి సంబంధించి పార్కింగ్, అనధికార ప్రకటనలు, బోర్డులు, హోర్డింగులు, ట్రీగార్డులు, అనధికార కట్టడాలు, కమ్యూనిటీ హాళ్ల దుర్వినియోగం, ప్రమాదకరంగా ఉన్న తీగలు, సెల్ టవర్లు, మార్కెట్ సమస్యలు, ఫుట్‌పాత్‌ల నిర్వహణ, ఆక్రమణ వంటి 13 రకాల సమస్యలపై ఫిర్యాదులు చేయవచ్చు.

● నీటి సరఫరాకు సంబంధించి 4 సేవలు, పట్టణ పేదరిక నిర్మూలనకు సంబంధించి 12, పాలనా పరమైనవి 6, ఇంజనీరింగ్ విభాగానికి సంబంధించి 16, వీధి దీపాల సమస్యపై 3, రెవెన్యూ విభాగానికి సంబంధించి 12 సేవలు ఈ యాప్‌లో అందుబాటులోకి తెచ్చారు. వీటికి సంబంధించిన సమస్య తలెత్తినప్పుడు ఇంటి నుంచే ఈ యాప్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు.

సబ్ డివిజన్ చేసే అధికారం లేదు

జిల్లా రెవెన్యూ అధికారి మలోల



డీఆర్‌ఓ మలోల

అనంతపురం కలెక్టరేట్, జూలై 26(ఆంధ్రజ్యోతి): ఏదైనా భూమి సబ్‌డివిజన్ చేసే అధికారం ఏ రెవెన్యూ అధికారికీ లేదు అని జిల్లా రెవెన్యూ అధికారి(డీఆర్‌ఓ)మలోల స్పష్టం చేశారు. రెవెన్యూ అంశాలపై డీఆర్‌ఓ 'ఆంధ్రజ్యోతి' ఇంటర్వ్యూలో పలు విషయాలు తెలియజేశారు.

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

ప్రశ్న : ఫ్రీ హోల్డ్ భూముల పరిస్థితి ఏంటి..?

జవాబు : జిల్లాలో 36వేల ఎకరాల వరకు భూములను ఫ్రీహోల్డ్‌లో ఉంచారు. వాటిలో 120 ఎకరాల భూములు రిజిస్ట్రేషన్లు జరిగినట్లు గుర్తించాం. ప్రభుత్వం మరో రెండు నెలల వరకు నిషేధం విధించింది.

ప్రశ్న : ఖాళీగా ఉన్న తహసీల్దార్ల స్థానాలపై చర్యలు..?

జవాబు : జిల్లాలో దాదాపు ఏడెనిమిది తహసీల్దార్ల స్థానాలు ఖాళీగా ఉన్నాయి. ఆ స్థానాల భర్తీ విషయంలో చర్యలు తీసుకుంటున్నాం. ప్రస్తుతం డిప్యూటీ తహసీల్దార్లను ఇన్‌చార్జి తహసీల్దార్లుగా నియమించాం.

ప్రశ్న : సబ్ డివిజన్ విషయంలో నెలకొంటున్న వివాదాలకు పరిష్కారం ఏమిటి..?

జవాబు : భూముల భాగాల విభజనకు సంబంధించి సబ్ డివిజన్ కీలకమవుతుంది. ఎవరైనా సబ్ డివిజన్ చేయమని కోరితే తహసీల్దార్ సర్వేయర్‌కు ఆదేశిస్తారు. తొలుత విలేజ్ సర్వేయర్ సంబంధిత భూమిని సర్వే చేస్తారు. మండల సర్వేయర్ స్క్రూటినీ చేస్తారు. ఓకే చేశాక తహసీల్దార్ అప్రూవల్ చేస్తారు. నేరుగా ఏ రెవెన్యూ అధికారికీ సర్వే చేసే అధికారం లేదు.

ప్రశ్న : మిగులు భూముల ఫైళ్ల పరిష్కారం కాలేదనే ఆరోపణలపై ఏమంటారు..?

జవాబు : అలాంటిదేమీ లేదు. మిగుల భూములకు సంబంధించి సరైన డాక్యుమెంట్లు, రికార్డులు ఉంటే తప్పకుండా పరిష్కారమవుతుంది. వెబ్ ల్యాండ్ కరెక్షన్ ప్రక్రియ ద్వారా అధికారులు సమస్యను పరిష్కరిస్తున్నారు. దాదాపు 150 ఫైల్స్ వరకు పరిష్కరించాం.

ప్రశ్న : రీ సర్వే ఎందుకు ఆలస్యమవుతోంది..?

జవాబు : ప్రతి మండలంలోనూ ఒక గ్రామాన్ని పైలెట్‌గా తీసుకుని రీ సర్వే చేపడుతున్నాం. రైతుల పొలాల సరిహద్దు విషయాల్లోనే వివాదాలు ఉన్నాయి. సాగులో ఉన్న వారికి లేదా సరైన డాక్యుమెంట్లు ఉన్న వారికే న్యాయం జరుగుతుంది. కొన్నిచోట్ల సంబంధిత గ్రామాల్లో రీ సర్వే పూర్తయింది. త్వరలోనే వేగవంతం చేస్తాం.

ప్రశ్న : రెవెన్యూలో అవినీతిపై ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారు..?

జవాబు : తహసీల్దార్ కార్యాలయాలు, రెవెన్యూ విషయాల్లో అవినీతి జరిగితే ఉపేక్షించం. ఫిర్యాదు చేస్తే సంబంధిత అధికారులపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటాం. గతంతో పోల్చితే ప్రజల్లోనూ అవగాహన పెరిగింది. కిందిస్థాయిలో ఎవరైనా తప్పు చేస్తే ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు.

సెక్టోరల్స్ ఎంపికకు అడుగులు

(5వ పేజీ తరువాయి)

వారికి ఇంటర్వ్యూలు నిర్వహించి, ప్రతిభ చూపిన వారిని సెక్టోరల్స్‌గా ఎంపిక చేయనున్నారు.

దరఖాస్తు చేసుకోండి

శ్రీసత్యసాయి జిల్లాలోని ఏపీ సమగ్రశిక్ష సెక్టోరియల్, అసిస్టెంట్ సెక్టోరియల్ ఖాళీ పోస్టులకు దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ క్రిష్టప్ప శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ కోఆర్డినేటర్(1), ఆల్టర్నేటివ్ స్కూల్ కో ఆర్డినేటర్(1), ప్లానింగ్ అండ్ ఎంఐఎస్ కో ఆర్డినేటర్ (1), 4.కమ్యూనిటీ మొబిలైజేషన్ ఆఫీసర్(1), అసిస్టెంట్ స్టాటిస్టికల్ ఆఫీసర్ (2), అసిస్టెంట్ అకడమిక్ మానిటరింగ్ ఆఫీసర్ జనరల్(1), అసిస్టెంట్ ప్రోగ్రామింగ్ ఆఫీసర్(1), అసిస్టెంట్ గర్ల్‌చైల్డ్ డెవలప్‌మెంట్ ఆఫీసర్(1), అసిస్టెంట్ ఇన్‌క్లూజివ్ ఎడ్యుకేషన్ కో ఆర్డినేటర్(1) పోస్టులు ఖాళీగా ఉన్నాయన్నారు. వీటికి దరఖాస్తు చేసుకోవడానికి శ్రీ సత్యసాయి జిల్లాలో పని చేస్తున్న స్కూల్ అసి స్టెంట్‌లు, సెకండరీ గ్రేడ్ టీచర్లు అర్హులన్నారు. ఈనెల 28నుంచి ఆగస్టు 4లోగా దరఖాస్తులను బుక్కపట్నంలోని సమగ్రశిక్ష కార్యాలయంలో అందజేయాలన్నారు. వివరాల కోసం సమగ్రశిక్ష వెబ్‌సైట్ డీఈఓఎస్‌ఎస్‌ఎస్.డీఎల్‌ఓజీఎస్‌పీఓటీ.కమ్‌ను చూడాలన్నారు.

వీరే అర్హులు..

ఈ పోస్టులకు శ్రీసత్యసాయిజిల్లాలో పనిచేస్తున్న వారు మాత్రమే అర్హులు. సస్పెండ్ అయిన వారు, గతంలో ఏపీ సమగ్రశిక్ష కార్యాలయంలో పనిచేస్తూ సరెండర్ అయినవారు అనర్హులు. నిర్ణీత వయస్సు 28-07-25 నాటికి 55 సంవత్సరాలోపు ఉండాలి. ప్రతి పోస్టుకు విడివిడిగా దరఖాస్తులు చేసుకోవాల్సి ఉంటుంది. ధ్రువీకరణ పత్రాలు జత పరచని దరఖాస్తులను తిరస్కరిస్తామని డీఈఓ తెలిపారు.

నేర రహిత జిల్లాగా మార్చడమే ధ్యేయం

● శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ రత్న



జిల్లా పోలీసు కార్యాలయంలో మాట్లాడుతున్న ఎస్పీ రత్న

పుట్టపర్తిరూరల్, జూలై 26(ఆంధ్రజ్యోతి): నేర రహిత జిల్లాగా మార్చడమే ధ్యేయంగా పని చేస్తున్నట్లు శ్రీసత్యసాయి జిల్లా ఎస్పీ రత్న పేర్కొన్నారు. అర్ధవార్షిక నేరసమీక్ష సమావేశంలో భాగంగా శనివారం ఆమె బెస్టు పోలీసింగ్‌పై మాట్లాడారు. జిల్లాలో గత ఏడాదితో పోలిస్తే నేరాల సంఖ్య 27శాతం తగ్గిందన్నారు. హత్యలు హత్యాయత్నాలు 36 శాతం తగ్గాయని, 41 శాతం క్రైం రేట్ తగ్గిందన్నారు. జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణకు ప్రథమ ప్రాధాన్యం ఇస్తున్నట్లు వెల్లడించారు. జిల్లాలో గ్రేవ్, నాన్‌గ్రేవ్ కేసులు, హత్యకేసులు, పోక్సో, అత్యాచారం, డెకాయిట్ కేసులు, వాహనాల దొంగతనం, మిస్సింగ్, చీటింగ్ తదితర కేసులలో దర్యాప్తు, రికవరీ గురించి పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించారు. జిల్లాలో నేరాల నియంత్రణకు ఏడాదికాలంగా ప్రత్యేక పటిష్టమైన ప్రణాళికతో చర్యలు చేపడుతున్నామన్నారు. రోడ్డుప్రమాదాలు, వైట్‌కాలర్ నేరాలను తగ్గించడానికి ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. సత్యసాయిబాబా జయంతి ఉత్సవాలకు దేశవిదేశాల నుంచి భక్తులు వస్తారని, అందుకనుగుణంగా ఇప్పటి నుంచే పక్కా ప్రణాళికతో ముందుకెళుతున్నామన్నారు. రోడ్డుప్రమాదాలను తగ్గించేందుకు తీసుకోవాల్సిన జాగ్రత్తలను ట్రాన్స్‌పోర్టు అధికారి కరుణాసాగర్‌రెడ్డి వివరించారు.

ప్రతిభకు పురస్కారాలు

వివిధ కేసులను త్వరగా ఛేదించడంలో ప్రతిభ కనబరిచిన 57 మంది పోలీసు సిబ్బందికి ఎస్పీ ప్రశంసాపత్రాలను అందచేశారు. కార్యక్రమం లో అడిషనల్ పబ్లిక్‌ప్రాసిక్యూటర్ సృజనా, డీడీఓ రాంనాయక్, ఐసీడీఎస్ పీడీ శ్రీదేవి, జిల్లా ఫైర్ ఆఫీసర్ మాధవనాయుడు, అడిషనల్ పీపీలు ఏపీపీలు లక్ష్మీనారాయణ, పద్మజ, ఈగల్ అడ్వైజర్ సాయినాథ్‌రెడ్డి, డీఎస్పీలు విజయ్‌కుమార్, నరసింగప్ప, శివనారాయణ, మహేష్, ఆదినారాయణ, శ్రీనివాసులు జిల్లాలోని సీఐలు, ఎస్సైలు పాల్గొన్నారు.

పేదల అభివృద్ధి కోసమే పీ-4

● కలెక్టర్ టీఎస్ చేతన్



గ్రామసభలో మాట్లాడుతున్న కలెక్టర్ చేతన్

లేపాక్షి, జూలై 26(ఆంధ్రజ్యోతి): పేదల అభివృద్ధి కోసమే పీ-4ను ప్రభుత్వం అమలు చేస్తోందని కలెక్టర్ టీఎస్ చేతన్ అన్నారు. కంచిసముద్రంలో శనివారం పీ-4పై నిర్వహించిన గ్రామసభలో ఆయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమం ద్వారా పేదల జీవితాల్లో మార్పు తీసుకురావాలని అధికారులకు సూచించారు. గ్రామంలోని విద్యావంతులు, ఎన్‌ఆర్‌ఐలు, ఉపాధ్యాయులు, అన్నివర్గాలవారు ఇందులో భాగస్వాములు కావాలని, పేదరిక నిర్మూలనకు తోడ్పడాలని పిలుపునిచ్చారు. బంగారు కుటుంబాల దత్తత మార్గదర్శకుల ఎంపిక, లబ్ధిదారుల నమోదు వంటి కార్యక్రమాలు చేపట్టాలని అధికారులకు సూచించారు. విద్య, ఆరోగ్య, ఆర్థిక రంగాల్లో వెనుకబడిన వారిని గుర్తించి, చేయూతనివ్వాలని, వారిని ఉన్నత స్థానాలకు తీసుకెళ్లాలని అన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ సౌజన్యలక్ష్మి, ఎంపీడీఓ నరసింహమూర్తి, సర్పంచ్ గంగలక్ష్మమ్మ, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

బదిలీ టీచర్ల జీతాలపై ఇంత నిర్లక్ష్యమా..?

● ఏపీటీఎఫ్ జిల్లా నేతల మండిపాటు



మాట్లాడుతున్న ఏపీటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు రాయల వెంకటేష్

అనంతపురం విద్య, జూలై 26(ఆంధ్రజ్యోతి): ఇటీవల బదిలీ అయిన వందలాది మంది ఉపాధ్యాయులకు జీతాలు చెల్లించకుండా నిర్లక్ష్యం చేయడం ఏమిటని ఏపీటీఎఫ్ జిల్లా నేతలు మండిపడ్డారు. శనివారం ఉపాధ్యాయ భవన్‌లో ఏపీటీఎఫ్ జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం రాష్ట్ర కార్యదర్శి పాపిరెడ్డి, జిల్లా అధ్యక్షుడు రాయల వెంకటేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి సిరాజుద్దీన్, పూర్వపు రాష్ట్రకార్యదర్శి నరసింహులు తదితరులు మాట్లాడుతూ.. జూన్, జూలై నెలల జీతాలు ఇవ్వకపోవడంతో అనేకమంది టీచర్లు ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. క్యాడర్‌స్ట్రెంత్ తేలలేదని, పొజీషన్ ఐడీలు కేటాయించలేదని చెబుతూ జీతాలు ఇవ్వకుండా అధికారులు కాలయాపన చేస్తున్నారన్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వెంటనే బదిలీ టీచర్లందరికీ జీతాలు అందేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. బోధన చేయకుండా నానా యాప్‌ల పేర్లతో టీచర్లకు ఆటంకం కలిగిస్తున్నారని అన్నారు. కార్యక్రమంలో ఏపీటీఎఫ్ నాయకులు నాగరాజు, మోహన్‌రెడ్డి, నరేష్‌కుమార్, సర్దార్‌వలి పాల్గొన్నారు.


శాంపుల్స్

పెద్దాస్పత్రికి పెరిగిన రోగుల తాకిడి

కిటకిటలాడుతున్న పరీక్ష కేంద్రాలు


వైద్యపరీక్షల కోసం తప్పని నిరీక్షణ

తీరని 'సెంట్రల్'ల్యాబ్ కష్టాలు



కిటకిటలాడుతున్న పెథాలజీ, బయోకెమిస్ట్రీ శాంపిల్స్ సేకరణ కేంద్రం

రోగులతో కిక్కిరిసిన మైక్రో బయాలజీ రక్తపరీక్షల విభాగం



అనంతపురం వైద్యం, జూలై 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ సర్వజన ఆసుపత్రిలో వైద్య పరీక్షలు చేయించుకోవాలంటే రోగులకు కష్టాలు తప్పడంలేదు. 12వ ఓపీలోని మూడు ఇరుకైన గదుల్లోనే రక్తపరీక్షల ప్రక్రియను నిర్వహిస్తున్నారు. మైక్రోబయాలజీ, బయోకెమిస్ట్రీ, పెథాలజీ విభాగాలను ఒక్కో గదిలో ఏర్పాటుచేసి రోగులనుంచి శాంపిల్స్(రక్తం, మూత్రం ఇతర నమూనాలు) సేకరిస్తున్నారు. రోజు 2వేల మంది వరకు ఓపీకి వస్తున్నారు. వారిలో 50శాతం వరకు పరీక్షలు చేయించుకోవాలని డాక్టర్లు రాస్తున్నారు. ఈ నేపథ్యంలో 12వ ఓపీలోని రక్తపరీక్షల విభాగంలో రోగులకు గంటల తరబడి నిరీక్షణ తప్పడంలేదు. డాక్టర్ సూచించిన పరీక్షలకు శాంపిల్ ఇవ్వాలంటే చుక్కలు కనబడుతున్నాయని రోగులు వాపోతున్నారు. అనంతపురం పెద్దాస్పత్రిలో వైద్య సేవలు బాగున్నాయన్న ప్రచారం జిల్లా సరిహద్దులు దాటడంతో ఇతర జిల్లాల రోగులు కూడా ఇక్కడికి వస్తున్నారు. ముఖ్యంగా మోకాళ్ల నొప్పి, హృద్రోగం, అపెండిసైటిస్ తదితర బాధితులు తరలివస్తున్నారు. ఈ క్రమంలో 12వ ఓపీలోని రక్తపరీక్షల విభాగంలో రోజుకు 300నుంచి 500వరకు రోగులు సంఖ్య నమోదవుతోంది. వారందరికీ శాంపిల్స్ తీసేందుకు ల్యాబ్ టెక్నీషియన్లు నానా తంటాలు పడుతున్నారు. కొన్ని పరీక్షలు అక్కడికక్కడే నిర్వహించినా ఎక్కువ పరీక్షల కోసం ల్యాబ్స్‌కు పంపాల్సి వస్తోంది.

అన్నీ ఒకేచోట

రక్తపరీక్షలను మైక్రోబయాలజీ, బయోకెమిస్ట్రీ, పెథాలజీ ఈ మూడు విభాగాల ఆధ్వర్యంలో నిర్వహిస్తారు. సీబీపీ, ఏఈసీ, ఈఎస్‌ఆర్, బీటీసీటీ తదితర రక్తపరీక్షలు పెథాలజీ విభాగంలో చేస్తారు. బయో కెమిస్ట్రీ ఆధ్వర్యంలో ఆర్‌బీఎస్, యూరియా, సీరం క్రియాటినైన్, ఎల్‌ఎఫ్‌టీ, లిపిడ్, ఫ్లూయిడ్ అనాలసిస్, ఎలెక్ట్రోలైట్స్, కాల్షియం, యూరిక్ యాసిడ్, థైరాయిడ్ తదితరాలు చేస్తారు. కల్చర్, హెచ్‌బీఎస్‌ఏజీ, హెచ్‌సీవీ, వీడీఆర్‌ఎల్, వైడల్, డెంగీ, సీఆర్పీ, ఆర్‌ఏ, ఏఎస్‌ఓ వంటి పరీక్షలను మైక్రో బయాలజీ విభాగంలో నిర్వహిస్తారు. ఈ మూడు విభాగాలను చిన్నగదుల్లో ఏర్పాటు చేయడంతో వందలాది మంది రోగులతో నిత్యం కిటకిటలాడుతున్నాయి.

ఎన్‌ఎంసీ నిబంధనలు బేఖాతరు

జాతీయ వైద్య మండలి(ఎన్‌ఎంసీ) నిబంధనల మేరకు వైద్య కళాశాలకు అనుబంధ ఆసుపత్రుల్లో రక్తపరీక్షల నిర్వహణ కోసం సెంట్రల్ ల్యాబ్‌ను ఏర్పాటు చేయాలి. మైక్రోబయాలజీ, బయోకెమిస్ట్రీ, పెథాలజీ ఈ మూడు విభాగాలను ఒకే కేంద్రంలో ఉండేలా సెంట్రల్ ల్యాబ్‌ను రూపొందించాలి. అయితే పెద్దాసుపత్రిలో శాంపిల్స్ మాత్రం ఒకచోట సేకరిస్తూ.. ల్యాబ్‌లను వేరువేరు ప్రాంతాల్లో ఏర్పాటుచేశారు. సేకరించిన శాంపిల్స్ ఆయా ల్యాబ్‌లకు విధిగా తీసుకెళ్లాలి. అయితే ఎన్‌ఎంసీ నిబంధనలు విస్మరిస్తూ రక్తపరీక్షల కష్టాలను కేంద్రీకృతం చేశారని రోగులు మండిపడుతున్నారు.

త్వరలోనే సెంట్రల్ ల్యాబ్

- ప్రొఫెసర్ ఆత్మారామ్, ప్రభుత్వ సర్వజన వైద్యశాల

ఎన్‌ఎంసీ నిబంధనల మేరకు సెంట్రల్ ల్యాబ్‌ను త్వరలోనే ఏర్పాటు చేయబోతున్నాం. రక్తపరీక్షల నిర్వహణ కష్టాలను జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ దృష్టికి తీసుకెళ్లాం. ఆయన స్పందించి కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటి(సీఎస్‌ఆర్) కింద నిధులను ఇప్పించేందుకు హామి ఇచ్చారు. దాదాపు రూ.50లక్షల వరకు నిధులను సమకూర్చేందుకు కలెక్టర్ చొరవ చూపారు. ఆ మేరకు సెంట్రల్ ల్యాబ్‌ను ఏర్పాటు చేసేలా ఏపీఎంఎస్‌ఐడీసీ ఇంజనీర్లకు ప్రతిపాదనలు పంపాం.

అప్పుల బాధతో చేనేత కార్మికుడి ఆత్మహత్య


శ్రీరాములు (ఫైల్)

ధర్మవరం, జూలై 26(ఆంధ్రజ్యోతి): అప్పులబాధతో ఓ చేనేత కార్మికుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన శనివారం సాయంత్రం చోటు చేసుకుంది. స్థానికులు, టూటౌన్ సీఐ రెడ్డప్ప తెలిపిన మేరకు.. పట్టణంలోని వైఎస్ఆర్ కాలనీకి చెందిన యర్రజోడు శ్రీరాములు(56) కూలిమగ్గం నేస్తూ కుటుంబాన్ని పోషించుకునేవాడు. కూలిమగ్గం ద్వారా నేసిన చీరలకు గిట్టుబాటు ధర లభించలేదు. దీనికి తోడు మద్యానికి బానిసయ్యాడు. ఈ క్రమంలో సుమారు రూ.10లక్షల దాకా అప్పులు చేశాడు. ఈ అప్పులు ఎలా తీర్చాలోనని కుటుంబ సభ్యులతో తరచూ చెబుతుండేవాడు. మనస్థాపానికి గురై ఇంట్లో ఎవరూలేని సమయంలో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని అతడి భార్య అమరావతిని కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఆమె ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ తెలిపారు. మృతుడికి భార్యతోపాటు ఐదుగురు కుమార్తెలు ఉన్నారు.

నాన్నా క్షమించు.. వెళ్లిపోతున్నా !

● అనారోగ్యంతో యువతి ఆత్మహత్య

సోమందేపల్లి, జూలై 26(ఆంధ్రజ్యోతి): 'నాన్నా..! నొప్పులు భరించలేకపోతున్నా. రోగంతో బాధపడుతూ, నిత్యం మిమ్మల్ని ఇబ్బంది పెట్టలేక ఆత్మహత్య చేసుకుంటున్నా. అమ్మా, నాన్న అందరూ నన్ను బాగా చూసుకున్నారు. నేను వెళ్లిపోతున్నానని బాధపడవద్దు' అని రేష్మ(26) లేఖ రాసి ఆత్మహత్య చేసుకుంది. ఈఘటన సోమందేపల్లిలోని దుర్గానగర్‌లో శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన మేరకు కియ అనుబంధ సంస్థలో పనిచేస్తున్న ముస్తఫా స్థానిక దుర్గానగర్‌లో నివాసముంటున్నాడు. ఇతడికి భార్య ఖాసీంబీ, కుమార్తె రేష్మ, కుమారుడు ఫక్రుద్దీన్ ఉన్నారు. రేష్మ గత కొన్నేళ్లుగా రుమటైటిస్ ఆర్థరైటిస్ వ్యాధితో బాధపడుతుండేది. ఎన్ని చోట్ల వైద్యం చేయించినా వ్యాధి నయం కాలేదు. ఈక్రమంలో జీవితంపై విరక్తిచెందిన రేష్మ ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఫ్యానుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుంది. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని, మృతదేహాన్ని పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. కాగా రేష్మ ప్రస్తుతం డీఎస్సీ పరీక్షలు రాసి ఫలితాల కోసం ఎదురు చూస్తున్నట్లు స్థానికులు తెలిపారు.

స్థలం కోసం గొడవ..
చేతి వేలిని కొరికేసిన వ్యక్తి

బెళుగుప్ప, జూలై 26(ఆంధ్రజ్యోతి): స్థలం కోసం గొడవపడి ఓవ్యక్తి చేతి వేలిని కొరికేసిన సంఘటన శనివారం మండలంలోని యలగలవంక తండాలో జరిగింది. గ్రామానికి చెందిన శ్రీరాముల నాయక్, చంద్రనాయక్‌ల మధ్య శుక్రవారం రాత్రి గొడవ జరిగింది. దీంతో శ్రీరాములు నాయక్ ఎడమచేతి చూపుడు వేలిని చంద్రానాయక్ కొరికేయడంతో రెండు ముక్కలైంది. కుటుంబ సభ్యులు 108 వాహనంలో కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆస్పత్రికి తీసుకెళ్లగా, మెరుగైన వైద్యం కోసం అనంతపురం తరలించారు. బాధితుడి భార్య సావిత్రి బాయి ఫిర్యాదు మేరకు ఎస్ఐ శివ కేసు నమోదు చేశారు.

పెచ్చులూడిపడి విద్యార్థులకు గాయాలు



గాయపడ్డ ఓంకార్, స్టీఫెన్ జాయ్

గుంతకల్లు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ఆలూరు రోడ్డులో నిర్వహిస్తున్న సెయింట్ పాల్ ఇంగ్లిషు మీడియం పాఠశాలలో పైకప్పు పెచ్చులు ఊడిపడి ఇద్దరు విద్యార్థులు గాయపడ్డారు. పాఠశాలకు వెళ్లిన ఓంకార్, స్టీఫెన్ జాయ్ అనే విద్యార్థులపై శనివారం మధ్యాహ్నం 3 గంటల సమయంలో పెచ్చులు ఊడిపడ్డాయి. విషయం తెలుసుకున్న ఎంఈఓ-1 మస్తాన్‌రావు పోలీసులతో కలిసి ఘటనా స్థలికి వెళ్లి గాయపడిన విద్యార్థులను ఆసుపత్రికి తరలించారు. విద్యార్థుల తలకు కుట్లు వేసిన అనంతరం ఇంటికి పంపారు. ఎంఈఓ-1 పాఠశాలకు వెళ్లి పరిస్థితిని సమీక్షించారు. పాఠశాల కరస్పాండెంటు అందుబాటులో లేకపోవడంతో ఫోనులో వివరణ కోరారు. ఘటన నేపథ్యంలో పలు విద్యార్థి సంఘాలు పాఠశాల వద్ద ఆందోళన నిర్వహించాయి.

రైతు ఆత్మహత్యాయత్నం

గార్లదిన్నె, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పాపినేపాళ్యం గ్రామానికి చెందిన వెంకటరెడ్డి అనే రైతు శనివారం పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన మేరకు.. వెంకటరెడ్డికి మరో రైతుకు గత కొంతకాలం నుంచి భూమి సమస్య ఉంది. ఈ క్రమంలోనే వెంకటరెడ్డి పురుగుల మందు తాగి ఆత్మహత్యా యత్నానికి పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స అనంతపురం తరలించారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

స్థిరంగా టమోటా ధరలు

అనంతపురంరూరల్, జూలై 26(ఆంధ్రజ్యోతి): కక్కలపల్లి టమోటా మార్కెట్‌లో టమోటా ధరలు స్థిరగా కొనసాగుతున్నాయి. గత మూడు రోజులుగా ఇదే పరిస్థితి నెలకొంది. శనివారం కిలో రూ.34తో అమ్ముడుపోయినట్లు రాప్తాడు మార్కెట్ యార్డు కార్యదర్శి రూప్‌కుమార్ తెలిపారు. అలాగే కనిష్ఠంగా రూ.20, సరాసరి ధర రూ.27 పలికినట్లు చెప్పారు. మార్కెట్‌కు మొత్తంగా 3,300టన్నుల టమోటాలు వచ్చాయని అన్నారు.

దత్తారెడ్డి మెరుపు శతకం



అనంతపురం క్లాక్‌టవర్, జూలై 26(ఆంధ్రజ్యోతి): జిల్లా క్రీడాకారుడు దత్తారెడ్డి మెరుపు శతకం సాధించాడు. ఆంధ్రా క్రికెట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో విజయనగరంలో జరుగుతున్న సీనియర్ వన్డే ఆంధ్రా ప్రాబబుల్స్ క్రికెట్ పోటీల్లో జిల్లా ప్లేయర్ దత్తారెడ్డి 60 బంతుల్లో 11 బౌండరీలు, 12 సిక్సర్లతో (127) అద్భుత సెంచరీ సాధించాడు. ఇప్పటికే ఇదే టోర్నీలో ఆఫ్ సెంచరీ చేసిన దత్తారెడ్డి మంచి జోరుమీదున్నాడు. మెరుపు సెంచరీ చేసిన దత్తారెడ్డిని జిల్లా క్రికెట్ సంఘం కార్యదర్శి భీమలింగారెడ్డి అభినందించారు.

'చలో కలెక్టరేట్'కు అనుమతులు లేవు

● డీఎస్పీ విజయ్‌కుమార్

పుట్టపర్తిరూరల్, జూలై 26(ఆంధ్రజ్యోతి): చలో కలెక్టరేట్ ఆందోళనకు అనుమతించాలంటూ వివిధ సంఘాల నాయకులు చేసుకున్న దరఖాస్తులను తిరస్కరిస్తున్నట్లు పుట్టపర్తి డీఎస్పీ విజయ్‌కుమార్ శనివారం ఓప్రకటనలో పేర్కొన్నారు. ఇందులో భాగంగా ముదిగుబ్బ ఎంపీపీ ఆదినారాయణ యాదవ్‌పై ఈనెల 28న చలో కలెక్టరేట్ ముట్టడికి అనుమతులు కోరుతూ పెట్టుకున్న దరఖాస్తును శాంతి భద్రతల దృష్ట్యా తిరస్కరించినట్లు డీఎస్పీ పేర్కొన్నారు. గిరిజనసంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాసనాయక్, కటారు గంగాధర్ యాదవ్, బీసీ సంఘం, కురువసంఘం నాయకులు, మాలమహానాడు, ఎమ్మార్పీఎస్ సంఘం జిల్లా అధ్యక్షుడు కలెక్టరేట్ ముట్టడి కోసం పెట్టుకున్న దరఖాస్తులను తిరస్కరించినట్లు తెలిపారు. పఠాన్ సలాంఖాన్ ముస్లిం మైనార్టీనాయకులు, నూర్‌బాషా సంఘం జిల్లా అధ్యక్షుడు విడివిడిగా మొత్తం నలుగురు దరఖాస్తులు పెట్టుకున్నారని, వాటిని తిరస్కరించామన్నారు. ధర్నాలు ఆందోళనలు చేపట్టేవారు ఆర్డీఓ కార్యాలయం వద్ద చేసుకోవచ్చన్నారు. 30 పోలీసుయాక్ట్ అమలులో ఉన్నందున వ్యక్తిగత విషయాల కోసం ఆందోళనలు చేపట్టడానికి ప్రయత్నించే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హెచ్చరించారు.

చీనీ టన్ను రూ.16వేలు

అనంతపురం రూరల్, జూలై 26(ఆంధ్రజ్యోతి): నగరంలోని వ్యవసాయ మార్కెట్‌లో శనివారం సీజనల్ చీనీకాయలు టన్ను గరిష్టంగా రూ.16వేలతో అమ్ముడుపోయినట్లు మార్కెట్ ఎంపిక శ్రేణికార్యదర్శి గోవిందు తెలిపారు. అలాగే కనిష్టంగా రూ.4వేలు, సరాసరి ధర రూ.12వేలు పలికాయన్నారు.

ఆంజనేయుడికి తొలి శనివారం పూజలు



నేమకల్లులో స్వామికి ప్రత్యేక అలంకరణ, కసాపురంలో శేష వాహనంపై స్వామి ప్రాకారోత్సవం


మురడిలో స్వామివారు

గుంతకల్లు, బొమ్మనహాళ్, డి.హీరేహాల్, జూలై 26(ఆంధ్రజ్యోతి): కసాపురంలోని నెట్టికంటి ఆంజనేయస్వామి దేవస్థానంలో స్వామికి శేష వాహనోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. శ్రావణ మాసోత్సవాల్లో భాగంగా తొలి శనివారాన్ని పురస్కరించుకుని నెట్టికంటి ఆంజనేయస్వామి మూల విరాట్‌కు వేకువనే అభిషేకాలు, స్వర్ణ కవచాలంకారాలు చేశారు. అనంతరం భక్తులకు దర్శనం కల్పించారు. ఈ సందర్భంగా ఆలయంలో సుందరకాండ పారాయణం, హనుమాన్ చాలీసా పఠన కార్యక్రమాలను నిర్వహించారు. మధ్యాహ్నం మహా మంగళహారతి, సాయంత్రం శేష వాహనంపై సీతారామ లక్ష్మణ సహిత ఆంజనేయ స్వాములను ఆశీనులను గావించి ప్రాకారోత్సవాన్ని నిర్వహించారు. కార్యక్రమాలలో కసాపురం, గుంతకల్లుకు చెందిన భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ఈ ఓ కె.వాణి, ధర్మకర్త సుగుణమ్మ, ఏఈఓ ఓంకారం వెంకటేశ్వరుడు, సూపరింటెండెంట్ పి.వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

● డి.హీరేహాళ్ మండలంలోని మురడిలో ఆంజనేయస్వామికి శనివారం ప్రత్యేక పూజలు చేశారు. తెల్లవారుజామునే సుప్రభాత సేవతో పూజలనుప్రారంభించారు. ఆలయ ప్రధాన అర్చకులు స్వామిని ప్రత్యేక పూలు, ఆభరణాలతో అలంకరించి అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. ఆంధ్ర, కర్ణాటక తదితర ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారి నరసింహారెడ్డి, గ్రామ పెద్దలు ఏర్పాట్లు చేశారు. భక్తులకు అన్నదానం చేశారు. బాలమేధావి పాఠశాల విద్యార్థులు పాల్గొని భక్తులకు సేవలు అందించారు. ఎస్ఐ గురుప్రసాద్‌రెడ్డి గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

● బొమ్మనహాల్ మండలంలోని నేమకల్లులో ఆంజనేయస్వామి వారికి శ్రావణమాసం తొలి శనివారం ప్రధాన అర్చకులు అనిల్ కుమార్ చార్యులు ప్రత్యేక పూజలు చేశారు. కర్ణాటక, ఏపీలోని వివిధ ప్రాంతాల నుంచి వందలాది మంది భక్తులు తరలివచ్చారు. భక్తులకు ఇబ్బంది కలగకుండా ఏర్పాట్లు చేశారు.

గుప్తనిధుల ముఠా అరెస్టు

పరారీలో ముగ్గురు


గుప్తనిధుల ముఠా సభ్యులను చూపుతున్న పోలీసులు

కళ్యాణదుర్గం/కుందుర్పి, జూలై 26 (ఆంధ్రజ్యోతి): గుప్తనిధుల తవ్వకాలు జరుపుతున్న ముఠాను పోలీసులు శనివారం అరెస్టు చేశారు. వివరాలను కళ్యాణదుర్గం రూరల్ సీఐ నీలకంఠేశ్వర రావు విలేకరులకు వెల్లడించారు. కుందుర్పి మండలంలోని రుద్రంపల్లి పరిసర ప్రాంతంలో బిసల మల్లప్ప దేవాలయం వద్ద గుప్తనిధుల తవ్వకాలు జరుపుతున్నట్లు సమాచారం రావడంతో దాడులు చేశామన్నారు. ఈక్రమంలో 12 మందిని అరెస్టు చేసి, ఎక్స్‌కవేటర్, రెండు కార్లు, నాలుగు ద్విచక్రవాహనాలను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పట్టుబడిన వారిలో ముగ్గురిని కేరళ రాష్ట్రానికి చెందిన వారిగా గుర్తించారు. ఘటనాస్థలంలో లభ్యమైన మూడు ఇత్తడి వస్తువులు, ఒక ఇత్తడి గంట, తవ్వకాలకు ఉపయోగించిన గడ్డపారలు తదితర వస్తువులను స్వాధీనం చేసుకున్న ట్లు తెలిపారు. కుందుర్పి మండలం రుద్రంపల్లికి చెందిన బోయ నాగభూషణ, బోయ బొమ్మన్న, పసుపుల మంజునాథ్, అనంతపురం పట్టణానికి చెందిన సయ్యద్ అష్రాఫ్, షేక్ ఫరూక్ బాషా, తలారి సుబ్బరాయుడు, చెంచు గొల్ల వెంకటేష్, కేరళ రాష్ట్రం కొల్లాం జిల్లాకు చెందిన నజుముద్దీన్, ఫసులుద్దీన్, ఎస్ నౌషద్, కంబదూరు గ్రామానికి చెందిన షేక్ షఫీ, ఎస్ మహమ్మద్‌లను అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. మరో ముగ్గురు వ్యక్తులు పరారీలో ఉన్నారని వారి కోసం గాలిస్తున్నట్లు సీఐ తెలిపారు. కేసు నమోదు చేసి, నిందితులను కోర్టులో హాజరుపరచినట్లు తెలిపారు.

కార్గిల్ విజయం స్ఫూర్తిదాయకం: బీజేపీ


కొవ్వొత్తులతో నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): పాకిస్థాన్‌తో 1999లో జరిగిన కార్గిల్ యుద్ధంలో భారత సైనికులు సాధించిన విజయం స్ఫూర్తిదాయకమని బీజేపీ నాయకులు పేర్కొన్నారు. కార్గిల్ విజయ్‌దివాస్‌ను పురస్కరించుకుని శనివారం బీజేపీ ఆధ్వర్యంలో స్థానిక క్లాక్‌టవర్ నుంచి సుభాష్‌రోడ్డు మీదుగా సప్తగిరిసర్కిల్ వరకు కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. సప్తగిరి సర్కిల్‌లో ఉన్న అమరవీరుల స్తూపం వద్ద బీజేపీ నాయకులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా బీజేపీ నాయకులు మాట్లాడుతూ 1999 ఫిబ్రవరిలో కశ్మీర్ ను ఆక్రమించుకునేందుకు ఆపరేషన్ బదర్ పేరిట ఉగ్ర వాదులను సరిహద్దులోకి పంపి, పాకిస్థాన్ యుద్ధానికి కాలు దువ్విందన్నారు. అప్పటి ప్రధాని వాజ్‌పేయి శాంతి చర్చలకు ఆహ్వానించినా పాకిస్థాన్ కుటిల బుద్ధితో యుద్ధం ఆరంభించిందన్నారు. 1999 మే 3 న ప్రారంభమైన యుద్ధం పాకిస్థాన్ తోకముడవడంతో జూలై 26న ముగిసిందన్నారు. భారత్ సైన్యం, అమరవీరుల జ్ఞాపకార్థంగా విజయ్‌దివస్ జరుపుకుంటున్నామని తెలిపారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు కొనకొండ్ల రాజేష్, మాజీ జిల్లా అధ్యక్షుడు సందిరెడ్డి శ్రీనివాసులు, బీజేపీ మాజీ రాష్ట్ర కార్యదర్శి చిరంజీవి రెడ్డి, మాజీ ఎమ్మెల్యే కాపు రామచంద్రారెడ్డి, సీనియర్ నాయకులు రత్నమయ్య, లక్ష్మీదేవి, లలిత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

వీర సైనికుల త్యాగాలు వృథాకావు

● మైభారత్ అధికారుల నివాళి

అనంతపురం క్లాక్‌టవర్, జూలై 26(ఆంధ్రజ్యోతి): వీర సైనికుల త్యాగాలు వృథా కావని మై భారత్ అధికారులు పేర్కొన్నారు. కార్గిల్ విజయ్ దివస్‌ను పురస్కరించుకుని శనివారం స్థానిక ఎస్‌వీ డిగ్రీ కళాశాలలో కేంద్ర యువజన క్రీడా శాఖ, మైభారత్, ప్రగతి పథం యూత్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో యువతకు వ్యాసరచన పోటీలు నిర్వహించారు. ఈ సందర్భంగా మై భారత్ అధికారులు మాట్లాడుతూ.. సైనికుల త్యాగాలు వృథా కావని, అనునిత్యం దేశ సరిహద్దులో ప్రాణాలకు తెగించి మనల్ని కంటికి రెప్పలా కాపాడుతున్నారన్నారు. 1999 జూలై 26న కాశ్మీర్‌లోని కార్గిల్ గ్రామంలో పాకిస్థాన్‌తో వీరోచితంగా పోరాడి ఎంతో మంది భారత సైనికులు తమ ప్రాణాలను త్యాగం చేసి విజయాన్ని అందించారని తెలిపారు. అనంతరం వ్యాసరచన పోటీల్లో విజేతలకు ప్రశంసా పత్రాలు, మెమెంటోలు అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రసాద్, మై భారత్ అధికారులు, రాష్ట్రపతి అవార్డు గ్రహీతలు జీవన్‌కుమార్, జయమారుతి, ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ ఆనందబాబు తదితరులు పాల్గొన్నారు.

హైకోర్టు న్యాయమూర్తికి ఘనస్వాగతం


న్యాయమూర్తికి మొక్క అందజేస్తున్న ఇన్‌చార్జ్ కలెక్టర్

అనంతపురం కలెక్టరేట్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): జిల్లా పర్యటనకు వచ్చిన రాష్ట్ర హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ కె.సురేష్‌రెడ్డికి జిల్లా ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణశర్మ ఘనస్వాగతం పలికారు. ఈ మేరకు శనివారం రోడ్లు, భవనాల అతిథిగృహంలో న్యాయమూర్తిని కలిసి పూల మొక్కను అందజేశారు.

క్షేత్రస్థాయిలో పరిశీలించిన
దేవదాయశాఖ అధికారులు

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

ఉరవకొండ, జూలై 26(ఆంధ్రజ్యోతి): పెన్నహోబిలం ఆలయ భూములకు సంబంధించి దేవదాయశాఖ అధికారులు శనివారం క్షేత్రస్థాయికి వెళ్లి వివరాలను ఆరాతీశారు. ఆంధ్రజ్యోతిలో 'నారసింహుడికే నామాలు' అనే కథనం ప్రచురితం కావడంతో జిల్లా దేవదాయశాఖ అధికారి తిరుమలరెడ్డి, ఇన్‌స్పెక్టర్ రాణి, ఆలయంలోని భూములకు సంబంధించిన రికార్డులను పరిశీలించారు. అనంతరం దేవాలయం భూములున్న మోపిడి, ఆమిద్యాల, చిన్నముష్టూరు, పెద్దముష్టూరు కోనాపురం గ్రామాల్లో సాగులో ఎవరు ఉన్నారన్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. దేవాలయాలకు సంబంధించి భూములు సాగుచేసుకుంటున్న సాగుదారులు కౌలు బకాయిలను వెంటనే చెల్లించాలని సూచించారు. దేవాలయ భూములను విక్రయిస్తే చర్యలు ఉంటాయన్నారు. ఇటీవల కాలంలో దేవాలయాలకు సంబంధించిన ఉన్నతాధికారుల పర్యటనంతా గోప్యంగా ఉంచడం చర్చగా మారుతోంది. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్ మారుతి ప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.


కోనాపురంలో వివరాలను ఆరా తీస్తున్న ఏసీ

వృద్ధుల ఇంటివద్దకే రేషన్

● ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణశర్మ

అనంతపురం కలెక్టరేట్, జూలై 26(ఆంధ్రజ్యోతి): వృద్ధులు, వికలాంగులు, మంచానికే పరిమితమైన వారికి ఇంటివద్దకే రేషన్ పంపిణీ చేయాలని ఇన్‌చార్జ్ కలెక్టర్ శివనారాయణ శర్మ అధికారులను ఆదేశించారు. శనివారం నగరంలోని నాయక్‌నగర్ 37వ ప్రభుత్వ రేషన్ షాపు పరిధిలో కార్డుదారుల ఇళ్లకు వెళ్లి ఇన్‌చార్జ్ కలెక్టర్ రేషన్ సరుకులను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. 26నుంచి 31వ తేదీలోపు సరుకుల పంపిణీ పూర్తి చేయాలని అధికారులకు సూచించారు. కార్డుదారులందరికీ బియ్యం, చక్కెర, సరుకులు పూర్తి స్థాయిలో పంపిణీ చేయాలన్నారు. కార్యక్రమంలో పౌరసరఫరాల శాఖ డీఎం రమేష్‌రెడ్డి, తహసీల్దార్ హరికుమార్, సీఎస్‌డీటీ బాష తదితరులు పాల్గొన్నారు.

సీళ్లను తస్కరించిన వైద్యుడు


సీసీ ఫుటేజీలో జూనియర్ డాక్టర్

అనంతపురం వైద్యం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ఆసుపత్రిలో రోగులకు వైద్య సేవలందించాల్సిన డాక్టర్ చోర కళను ప్రదర్శించారు. అలాగని ఖరీదైన వస్తువులు కాజేయలేదు. సీళ్లను మాత్రమే తస్కరించారు. ప్రభుత్వ సర్వజన వైద్యశాల అధికారులు తెలిపిన మేరకు.. షారుక్ అహ్మద్ అనే వ్యక్తి హోమియోపతి హౌస్ సర్జన్‌గా (జూనియర్ డాక్టర్) పని చేస్తున్నారు. ఈయన ఆస్పత్రిలోని వివిధ వైద్య విభాగాధిపతులకు సంబంధించిన సీళ్లను దొంగిలిస్తున్నారు. ఈ విషయం డాక్టర్లు, సిబ్బందికి అంతు చిక్కలేదు. దీంతో సీసీ ఫుటేజ్‌లను పరిశీలించిన అధికారులు డాక్టరే దొంగ పనులు చేస్తున్నట్లు గుర్తించారు. ఆర్ఎంఓ, జనరల్ మెడిసన్ తదితర డాక్టర్లకు చెందిన సీళ్లను దొంగలిస్తూ సీసీ ఫుటేజ్‌ల ద్వారా పట్టుపడ్డారు. దీంతో సంబంధిత జూనియర్ డాక్టర్‌పై చర్యలు తీసుకుంటామని సూపరింటెండెంట్ డాక్టర్ ఆత్మారామ్ తెలిపారు.

594 మెట్రిక్ టన్నుల ఎరువుల సరఫరా

అనంతపురం అర్బన్, జూలై 26(ఆంధ్రజ్యోతి): జిల్లాకు 594 మెట్రిక్ టన్నుల కాంప్లెక్స్ ఎరువులు సరఫరా అయ్యాయని అనంతపురం ఏడీఏ అల్తాఫ్ అలీ ఖాన్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. 24-24-0 కాంప్లెక్స్ ఎరువులు 282 మెట్రిక్ టన్నులు, 20-20-0-13 కాంప్లెక్స్ ఎరువులు 64 మెట్రిక్ టన్నులు, 9-24-24-0-3-0-6 ఎరువులు 248 మెట్రిక్ టన్నులు సరఫరా అయ్యాయన్నారు. జాయింట్ కలెక్టర్ ఆదేశాల మేరకు ఏపీ మార్క్‌ఫెడ్, హోల్‌సేల్, రిటైల్ డీలర్లకు పంపిణీ చేస్తామని పేర్కొన్నారు.

స్కూల్‌గేమ్స్ సెక్రటరీ పోస్టుకు దరఖాస్తు చేసుకోండి

అనంతపురం విద్య, జూలై 26(ఆంధ్రజ్యోతి): జిల్లా స్కూల్‌గేమ్ సెక్రటరీ నియామకానికి సంబంధించి పీడీలు, పీఈటీల నుంచి దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్లు డీఈఓ ప్రసాద్‌బాబు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. 58 సంవత్సరాలలోపు ఉండి, కంప్యూటర్ పరిజ్ఞానం కలిగి ఉండాలన్నారు. ప్రభుత్వ, జిల్లాపరిషత్, మున్సిపాల్టీ ఉన్నత పాఠశాలలో పనిచేస్తున్న పీడీలు, పీఈటీలు ఇందుకు అర్హులని పేర్కొన్నారు. అర్హత కలిగిన వారు ఆగస్టు 6వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలన్నారు.

ఓపెన్‌స్కూల్ అడ్మిషన్లు పెంచుదాం

అనంతపురం విద్య, జూలై 26(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని ఓపెన్ స్కూల్స్‌లో పది, ఇంటర్ అడ్మిషన్లను పెంచుదామని జిల్లా విద్యాశాఖ పరీక్షల విభాగాధికారి గోవిందనాయక్ పేర్కొన్నారు. శనివారం ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, గురుకులాల సంక్షేమ శాఖల కార్యాలయాలకు ఏసీ వెళ్లి ఆయా శాఖల అధికారులను కలిశారు. తొలుత ఓపెన్‌స్కూల్స్‌కు సంబంధించిన పోస్టర్లను ఆయా శాఖల అధికారులతో విడుదల చేయించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. ఓపెన్ స్కూల్స్, వాటి అడ్మిషన్లు గురించి వివరించారు. అడ్మిషన్ల పెంపునకు అన్ని శాఖలు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమశాఖ డీడీ కుష్బూకొఠారి, గిరిజన సంక్షేమ శాఖ డీడీ శ్రీనివాసరావు, మైనార్టీ వెల్ఫేర్‌శాఖ డైరెక్టర్ రామసుబ్బారెడ్డి, గురుకుల పాఠశాలల జిల్లా కోఆర్డినేటర్ విజయలక్ష్మీ పాల్గొన్నారు.

వడివడిగా చేరుతున్న కృష్ణాజలాలు

బెళుగుప్ప, జూలై 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని జీడిపల్లి రిజర్వాయర్‌కు ఆరు పంపుల ద్వారా ఎత్తిపోస్తుండటంతో రెండు రోజుల నుంచి కృష్ణ జలాలు వడివడిగా చేరుతున్నాయి. శనివారం ఇన్‌ఫ్లో 1127 క్యూసెక్కులు ఉన్నట్లు హంద్రీనీవా అధికారులు తెలిపారు. ప్రస్తుతం రిజర్వాయరులో 1.164 టీఎంసీల నీటి నిల్వ వుందని వెల్లడించారు.

పేరూరులో రెండు డెంగీ కేసుల నమోదు

రామగిరి, జూలై 26(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని పేరూరు గ్రామంలో రెండు డెంగీ కేసులు నమోదయ్యాయి. విషయం తెలిసిన వెంటనే వైద్యసిబ్బంది, అధికారులు పారిశుధ్య పనులు చేపట్టారు. గ్రామంలో లక్ష్మీ అనే బాలికకు, ముదషిర్ అనే బాలుడికి డెంగీ సోకినట్లు వైద్యులు నిర్ధారించారు. వారికి వైద్యసేవలు అందిస్తూ గ్రామంలో మిలాథిన్ స్ప్రే చేయించి పారిశుధ్య పనులు చేపట్టారు. కార్యక్రమంలో మలేరియా సబ్‌యూనిట్ ఆఫీసర్ జయరాంనాయక్, పంచాయతీ కార్యదర్శి సత్యమ్మ, వైద్యసిబ్బంది పాల్గొన్నారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, జ్వరం వస్తే ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో చికిత్స చేయించుకోవాలని సూచించారు.

నలుగురు దొంగల అరెస్ట్


అరెస్ట్ వివరాలను వెల్లడిస్తున్న పోలీసులు

పుట్లూరు, జూలై 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎ.కొండాపురం గ్రామశివారులో ఉన్న గాలిమరల సామగ్రి చోరీ కేసులో నలుగురిని అరెస్ట్ చేసినట్లు సీఐ సత్యబాబు తెలిపారు. ఈ మేరకు శనివారం స్థానిక పోలీస్‌స్టేషన్‌లో విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. కొండాపురం వద్ద కిందపడిపోయిన గాలిమరలను దొంగలించారని తెలిపారు. సమాచారం మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేయగా కళ్యాణదుర్గం మండలం వర్లి గ్రామానికి చెందిన చంద్రశేఖర్, రామగిరి మండలం పేరూరుకు చెందిన శివయ్య, కంబదూరు మండలం అచ్చెమ్మపల్లికి చెందిన అజయ్, హరికృష్ణను అరెస్ట్ చేశామన్నారు. వారివద్ద నుంచి రూ.3,47,200 నగదు, గ్యాస్ సిలిండర్, ఆటోను స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. సమావేశంలో ఎస్ఐ వెంకటనరసింహం, సిబ్బంది పాల్గొన్నారు.

ఇద్దరు గంజాయి విక్రేతలు..


వివరాలు వెల్లడిస్తున్న సీఐ, ఎస్ఐ

అనంతపురం క్రైం, జూలై 26(ఆంధ్రజ్యోతి): గంజాయి అమ్ముతున్న ఇద్దరిని అరెస్టు చేసినట్లు వన్‌టౌన్ సీఐ శ్రీకాంత్ యాదవ్, ఎస్ఐ శ్రీనివాసులు పేర్కొన్నారు. నిందితుల వివరాలను వన్ టౌన్ స్టేషన్‌లో శనివారం వారు ప్రకటించారు. నగరంలోని భైరవనగర్ సర్కిల్‌లో ఆర్టీఓ ఆఫీస్ వద్ద గంజాయి అమ్ముతున్న మరువకొమ్మ కాలనీకి చెందిన కటిక మహమ్మద్ సాజిద్(22) అలియాస్ సాదిక్, ఉమానగర్‌లో నివాసం ఉండే వనం శివచరణ్(22) అలియాస్ ట్యాటూ చరణ్‌ను అరెస్టుచేశామన్నారు. వారి నుంచి కేజీ గంజాయి స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు.

న్యూస్ బాక్స్

భక్తి శ్రద్ధలతో ఏడు శనివారాల వ్రతం


ఏడు శనివారాల వ్రతంలో పాల్గొన్న మహిళలు

ధర్మవరం, జూలై 26(ఆంధ్రజ్యోతి): ఏడు శనివారాల వ్రతాన్ని పట్టణంలోని శ్రీనివాసనగర్‌లో వెలసిన లక్ష్మీవెంకటేశ్వర స్వామి ఆలయంలో మూడో శనివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించారు. 40మంది మహిళలు వ్రతాన్ని ఆచరించారు.

నేడు జిల్లా స్థాయి యోగాసన పోటీలు

ధర్మవరం, జూలై 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని బీఎస్‌ఆర్ బాలికల మున్సిపల్ ఉన్నత పాఠశాలలో ఆదివారం జిల్లా స్థాయి యోగాసన పోటీలు నిర్వహించనున్నట్టు యోగా అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు సోమేశ్వరరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పోటీలలో పదేళ్ల నుంచి 55 సంవత్సరాల లోపు ఉన్న వారందరూ పాల్గొనవచ్చన్నారు.

స్వమిత్వ యోజనపై అవగాహన

నంబులపూలకుంట, జూలై 26(ఆంధ్రజ్యోతి):ర మండలంలోని ప్రతి పంచాయతీ పరిధిలో ఇంటి హక్కు దారులను గుర్తించాలని ఈఓఆర్డీ మాధవరెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో స్వమిత్వ యోజనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. సర్వేయర్లు, డిజిటల్ అసిస్టెంట్లు, పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందికి అవగాహన కల్పించారు.

స్వర్ణాంధ్రపై అవగాహన కల్పిద్దాం

ఓబుళదేవరచెరువు, జూలై 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని గ్రామాల్లో స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్రపై అవగాహన కల్పించాలని వెలుగు ఏరియా కోఆర్డినేటర్ కె. రవీంద్ర, ఎంపీడీఓ శివరాంప్రసాద్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ మేరకు శనివారం వెలుగు కార్యాలయంలో వీఓఏలతో సమావేశం నిర్వహించారు. స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ 2025 యాప్, స్వచ్ఛభారత్‌పై అవగాహన కల్పించారు. సీసీలు, ఎంసీఓ రమణనాయక్, వీఓఏలు, వెలుగు సిబ్బంది పాల్గొన్నారు.

వడియరాజుల మండల కమిటీ ఎంపిక

ఓబుళదేవరచెరువు, జూలై 26(ఆంధ్రజ్యోతి): వడియరాజుల సంక్షేమ సంఘం మండల నూతన కార్యవర్గాన్ని శనివారం ఏకగ్రీవంగా ఎంపిక చేశారు. మండలకేంద్రంలో ఆ కులస్థులు సమావేశమై అధ్యక్షుడిగా ఇడగొట్టు ఆంజనేయులు, ప్రధాన కార్యదర్శిగా యు. చంద్ర, ఉపాధ్యక్షుడిగా దండగల చెన్నకేశవులను ఎన్నుకున్నారు. అలాగే కోశాధికారిగా దండగల గంగులప్ప, కార్యనిర్వాహక కార్యదర్శులుగా రామిరెడ్డిపల్లి మకము తక ఆంజనేయులు, జెరిపిటి గంగరాజు, మల్లెల విజయ్‌కుమార్, డేరంగుల చలపతి, గౌరవాధ్యక్షుడిగా ఇడగొట్టు వీరాంజనేయులు, గౌరవ సలహాదారులుగా కుచ్చెపు శ్రీనివాసులును ఎన్నుకున్నారు.

మండలానికి ట్రైనీ ఎస్‌ఐ

గాండ్లపెంట, జూలై 26(ఆంధ్రజ్యోతి) :మండలానికి ట్రైనీ ఎస్‌ఐగా రవికుమార్ శనివారం బాధ్యతలు చేపట్టారు. ఆర్నెల్లుగా ఇక్కడి ఎస్‌ఐ స్థానం ఖాళీగా ఉంది. పలువురి సమస్యలు పరిష్కారం కాలేదు. నూతనంగా ట్రైనీ ఎస్‌ఐ బాధ్యతలు చేపట్టారు.

రహదారి కోసం విద్యార్థుల ధర్నా

ముదిగుబ్బ, జూలై 26(ఆంధ్రజ్యోతి): రహదారి సౌకర్యం కల్పించాలంటూ స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు ధర్నాకు దిగారు. ఆ కళాశాల పక్కన 342 బైపాస్ రోడ్డు నిర్మాణం జరుగుతోంది, కళాశాలకు సంబంధించిన రోడ్డును బైపాస్ నిర్మాణంలో భాగంగా శనివారం ఎక్స్‌కవేటర్‌తో తొలగిస్తుండగా కళాశాల విద్యార్థులు అడ్డుకున్నారు. కళాశాలకు దారి చూపించిన తర్వాతే పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. అనంతరం బస్టాండ్ కూడలిలో మానవహారంగా ఏర్పడి రాస్తారోకో చేశారు.

చిగిచెర్ల విద్యార్థి ప్రతిభ


విద్యార్థి అఫ్జల్‌మెహరాజ్

ధర్మవరం రూరల్, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మండలంలోని చిగి చెర్ల జిల్లా పరిషత్ పాఠశాలలో పదో తరగతి విద్యార్థి అఫ్జల్ మెహ రాజ్ జూడోలో నేషనల్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్‌కు ఎంపికైన ట్లు పాఠశాల పీడీ ప్రతాప్ శనివారం తెలిపారు. భోపాల్‌లో జరిగిన జాతీయస్థాయి ఎంపిక పోటీలలో మంచి ప్రతిభ చూ పి నేషనల్ సెంటర్‌ఆఫ్ ఎక్సలెన్స్‌కు ఎంపికైనట్లు తెలిపారు. దేశవ్యాప్తంగా 45మంది ఎంపికయ్యారని ఇందులో రాష్ట్రం తరపున అఫ్జల్‌మెహరాజ్ ఎంపిక కావడం విశేష మన్నారు.

'సేల్స్‌ఫోర్స్ రంగంలో అద్భుత అవకాశాలు'

పుట్టపర్తి రూరల్, జూలై 26(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఎంబీఏ, ఇంజనీరింగ్ విద్యార్థులకు సేల్స్ ఫోర్స్ రంగంలో అద్భుత అవకాశాలున్నాయని సేల్స్ ఫోర్స్ ట్రయల్ బ్లేజర్ కమ్యూనిటీ హెఓడీలు శ్రీశేష తమలల్ల, అక్షయవాసు, పవన్‌కుమార్ పటేల్ పేర్కొన్నారు. స్థానిక సంస్కృతి స్కూల్ ఆఫ్ ఇంజనీరింగ్‌లో శనివారం ఈ హ్యాండ్స్ ఆన్ సదస్సు నిర్వహించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు అడ్మినిస్ట్రేషన్ డెవలపర్ మాడ్యూల్స్‌లో ఉద్యోగ అవకాశాలు పొందేందుకు కావాల్సిన మెలకువపై వారు రెండు రోజుల పాటు విద్యార్థులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. శనివారం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. వారితో పాటు సేల్స్ ఫోర్స్ ట్రయల్ బ్లేజర్ కమ్యూనిటీ హెఓడీలు సుఖేష్ కుమారి, ఆర్వీ సహన, హిరేకోల్కర్ చైత్ర, ఐశ్వర్య పాల్గొన్నారు.

కుక్కల దాడిలో 20 గొర్రెల మృతి

తనకల్లు, జూలై 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొక్కంటి పంచాయతీ పోతుపాళ్యం ఎస్సీకాలనీలో శనివారం తెల్లవారుజామున కుక్కలదాడిలో 20 గొర్రెలు మృతిచెందాయి. కొక్కంటి గ్రామపంచాయతీ పోతుపాళ్యం ఎస్సీకాలనీకి చెందిన నక్కా రామలక్ష్మమ్మ, బయ్యన్న దంపతులు గొర్రెల పెంపకం ద్వారా జీవనం సాగిస్తున్నారు. ఐదేళ్లుగా పది గొర్రెలతో ప్రారంభమై నేడు 40 గొర్రెలకు చేరింది. వాటిని రామలక్ష్మమ్మ అడవికి తీసుకెళ్లి మేపుకొచ్చేది. రాత్రిళ్ల గ్రామ సమీపంలోని దొడ్డిలో నిలుపుకునేదు. అయితే శనివారం తెల్లవారుజామున ఆమె గొర్రెల మందలోకి కుక్కలు జొరబడ్డాయి. 20గొర్రెలను కొరికి చంపేశాయి. ఉదయం గుర్తించిన రామలక్ష్మమ్మ బోరున విలపించారు. దీంతో రూ.3లక్షలు నష్టం వాటిల్లినట్లు బాధితురాలు రామలక్ష్మమ్మ, గ్రామస్థులు ఆవేదన వ్యక్తం చేశారు. తనను ప్రభుత్వం ఆదుకోవాలని ఆమె కోరారు.

టీడీపీ కార్యకర్త మృతి

● మాజీ మంత్రి పల్లె సంతాపం

ఓబుళదేవరచెరువు, జూలై 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని దిగువపల్లికి చెందిన టీడీపీ సీనియర్ కార్యకర్త జెరిపిటి ప్రసాద్ (44) అనారోగ్యంతో శనివారం మృతిచెందారు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి పల్లె రఘునాథ్‌రెడ్డి గ్రామానికెళ్లి మృతదేహానికి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆర్థికసాయం అందించారు. ఆయనతో పాటు టీడీపీ మండల కన్వీనర్ శెట్టివారి జయచంద్ర, నాయకులు పిట్టా ఓబులరెడ్డి, బోయపల్లి శివారెడ్డి, తుమ్మల మహబూబ్‌బాషా, ఆంజనప్ప, ఆర్ఎంపీ జాకీర్, నిజాం, చికెన్ షానూ, ఇ ర్షాద్, సౌదీ నాగరాజు, గంటా శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

శ్రావణమాసం ఉత్సవాలు ప్రారంభం

● పాలపాటిదిన్నె ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు
● పాల్గొన్న ఎమ్మెల్యే కందికుంట



అలంకరణలో పాలపాటి దిన్నె ఆంజనేయస్వామి, ప్రత్యేక పూజల్లో పాల్గొన్న ఎమ్మెల్యే కందికుంట

నల్లచెరువు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ప్రసిద్ధి గాంచిన పాల పాటిదిన్నె ఆంజనే యస్వామి ఆలయంలో శ్రావణమాస ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. శ్రావణమాసం మొదటి శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ పూజల్లో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ పాల్గొన్నారు. ఆలయ ఈఓ మురళీక్రిష్ణ, అర్చకులు ఆయన స్వా గతం పలికారు. ప్రత్యేక పూజల అనంతరం ఎమ్మెల్యేని దుశ్శాలువతో ఘనంగా సన్మానించి, తీర్థప్ర సాదాలు అందించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ శ్రావణ మాసం సందర్భంగా భక్తులకు ఇబ్బం దులు లేకుండా ఏర్పాట్లు చేయాలని ఆలయ అధికారులకు తెలిపారు. మొదట శనివారం అన్న దానానికి ఎమ్మెల్యే కందికుంట, ఆయన సతీమణి యశోదమ్మ సహకరించారు. తరువాత అన్నదాన కార్యక్రమంలో పాల్గొని, పలువురికి భోజ నం వడ్డించారు. ఆలయ పరిస రాలను పరిశీలించారు. టీడీపీ రాష్ట్ర కార్యదర్శి పవన్ కుమార్‌రెడ్డి, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ అశ్వత్థ నా యుడు, బీసీ సెల్ నాయకుడు దేవేంద్రగౌడ్, సింగిల్ విండో మాజీ అధ్యక్షులు ఆంజనప్ప, కిరణ్ కుమార్ నాయుడు, సతీష్ నాయుడు, కావడి ప్రవీణ్ కుమార్, అర్చకులు నాగరాజు, ఆంజనేయదాస్ పాల్గొన్నారు.

● ధర్మవరం/ అమడగూరు/ గాండ్లపెంట/ నల్లమాడ : శ్రావణ మాసం మొదటి శనివారం పురస్కరించుకుని ధర్మవరం పట్టణంలోని పుట్టపర్తి రహదారి పక్కన ఉన్న షిర్డీ సాయిబాబా ఆలయ ఆవరణంలో ఉన్న ఆంజనేయస్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అలాగే అమడగూరు మండలంలోని మహమ్మదాబాద్ వద్ద వెలసిన పిచ్చిలికొండ ఆంజనేయస్వామి, గాండ్లపెంట మండలం మునగలవారిపల్లి గరుడాంజనేయస్వామి, నల్లమాడ మండలంలోని పెద్దకోట్లపల్లి ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.


ధర్మవరంలో...


మహమ్మదాబాద్‌లో...


మునగలవారిపల్లిలో...


పెద్దకోట్లపల్లిలో...

పచ్చని చెట్లపై గొడ్డలి వేటు

● విద్యుత్ అధికారుల తీరుపై ప్రజల మండిపాటు


తిప్పాబట్లపల్లి వద్ద చెట్లను కొట్టివేసిన దృశ్యం

కొత్తచెరువు, జూలై 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం పర్యావరణాన్ని పెంపొందించాలనే సదుద్దేశ్యంతో విరివిగా మొక్కలను నాటే కార్యక్రమాన్ని చేపడుతోంది. అయితే కొందరు అధికారుల నిర్లక్ష్యం వల్ల ఆర్‌అండ్‌బీ రోడ్లకు పక్కనే ఉన్న పచ్చని చెట్లను విద్యుత్‌శాఖ అధికారులు ఎలాంటి అనుమతులు తీసుకోకుండా కొట్టివేస్తున్నారని ఆయా గ్రామాల ప్రజలు వాపోతున్నారు. కొత్తచెరువు విద్యుత్ సబ్‌స్టేషన్ నుంచి మరుకుంటపల్లికి 24 గంటల విద్యుత్ సరఫరా ఇవ్వాలని ఆర్‌డీ ఎస్ఎస్ సంస్థ ద్వారా విద్యుత్ లైన్ల పనులను చేపట్టారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆర్‌అండ్‌బీ రోడ్లు, చెట్లకు ఆరు మీటర్ల దూరంలో విద్యుత్ లైన్లను లాగాల్సి ఉంది.. అయితే విద్యుత్ అధికారులు అత్యుత్సాహంతో ఆర్‌అండ్‌బీ, ఫారెస్టు అధికారుల అనుమతి లేకుండా రోడ్ల పక్కన ఉన్న పచ్చని చెట్లను ఇష్టానుసారంగా కొట్టివేస్తూ విద్యుత్ లైన్లను లాగుతున్నారు. దీంతో పర్యావరణ దెబ్బతింటోందని పలువురు వాపోతున్నారు. అదే ఎవరైనా రైతు తన పొలంలోని చెట్లను కొట్టాలంటేనే ఫారెస్టు అధికారులు, రెవెన్యూ అధికారులు సవాలక్ష నిబంధనలు విధిస్తారు. మరి ఆర్‌అండ్‌బీ రోడ్లకు పక్కన పెరిగిన చెట్లను విచ్చలవిడిగా కొట్టివేస్తుంటే వారిపై చర్యలు తీసుకోరా అంటూ ప్రజలు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఆర్‌అండ్‌బీ, ఫారెస్టు అధికారులు స్పందించి రోడ్లకు ఇరువైపులా ఉన్న చెట్లను కాపాడాలని ప్రజలు కోరుతున్నారు.


చెట్లను నరికేసిన దృశ్యం

● ధర్మవరం: పట్టణంలోని శివాలయం వద్ద ఎన్నో సంవత్సరాల నుంచి స్థానికులు పెంచి, పార్కులా ఏర్పాటు చేసుకున్న స్థలంలోని చెట్లను ట్రాన్స్‌కో అధికారులు నిర్దాక్షిణ్యంగా ఇటీవల కొట్టివేశారని స్థానిక ప్రజలు ఆగ్రహం వ్య క్తం చేస్తున్నారు. శివాలయం వద్ద కరెంటు వైర్లకు అడ్డుగా ఉన్నాయని ఆలయ కమిటీ సభ్యులకు, కానీ కాలనీ వాసులకు గానీ చెప్పకుండా కొట్టివేయడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. నిత్యం స్థానిక వృద్ధులు, పిల్లలు ఆ చెట్లకింద సేదదీరేవారు. ఒక వైపు ప్రభుత్వాలు మొక్కలను పెంచి వాటిని సంరక్షించాలని ప్రకటనలు చేస్తుంటే, కరెంటు వైర్లకు అడ్డుగా ఉన్నాయని చెట్లను కొట్టివేయడం ఏమిటని స్థానికులు ప్రశ్నిస్తున్నారు. ఇకనైనా ఉన్నతాధికారులు స్పందించి కొమ్మలను మా త్రమే కొట్టివేసేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

అర్హులకు పథకాలు అందించేందుకు కృషి

● ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి


బండ్లపల్లిలో ఇంటింటా పర్యటిస్తున్న ఎమ్మెల్యే

కొత్తచెరువు, జూలై 26(ఆంధ్రజ్యోతి): అన్ని విధాలా అర్హులైనా ప్రభుత్వ పథకాలు అందని వారిని క్షేత్రస్థాయిలో గుర్తించి, వారికి పథకాలు అందేలా చూస్తామని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి పేర్కొన్నారు. ఆమె శనివారం మండలంలోని బండ్లపల్లి పంచాయతీలో 'సుపరిపాలనలో తొలిఅడుగు' కార్యక్రమాన్ని టీడీపీ నాయకులు, కార్యకర్తలతో కలిసి నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, అందిస్తున్న పథకాల గురించి వివరిస్తూ కరపత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... ప్రభుత్వం అర్హులైన ప్రతి ఒక్కరికి పథకాలను అందిస్తుందన్నారు. అదేవిధంగా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధి కోసం విరివిగా పంచాయతీలకు నిధులు విడుదల చేస్తోందన్నారు. గత వైసీపీ పాలనలో పంచాయతీలకు ఒక్క రూపాయి కూడా ఇచ్చిన పాపాన పోలేదన్నారు. హంద్రీనీవా కాలు వ లైనింగ్ పనులను యుద్ధ ప్రాతిపదికన నిర్వహిస్తున్నారని, త్వరలోనే చెరువులకు నీటిని తెస్తామన్నారు. గత ప్రభుత్వంలో వైసీపీ నాయకులు, ప్రజాప్రతినిధులు ప్రతి ఒక్కటి దోచుకోవడం, దాచుకోవడం పనిగా పెట్టుకున్నారని, రాష్ట్రాభివృద్ధికి చేసింది ఏమీలేదన్నారు. దీనికి లిక్కర్ స్కాం నిదర్శనమన్నారు. టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

రైతుల అభ్యున్నతికి పనిచేయండి : ఎమ్మెల్యే

కొత్తచెరువు, జూలై 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం వ్యవసాయ రంగాన్ని బలోపేతం సేందుకు సహకారం సంఘం అధ్యక్షులను నియమిస్తోందాని, కావున సంఘాలకు అధ్యక్షు లుగా నియమితులైన వారు వ్యవ సాయరంగం బలోపేతానికి, రైతుల అభ్యున్నతికి పాటుపడాలని ఎమ్మెల్యే పల్లె సింధూరరెడ్డి సూచించారు. బండ్లపల్లి సహకార సంఘానికి నూతనంగా ఎన్నికైన శంకరప్ప ప్రమాణ స్వీకార కార్యక్రమానికి ఎమ్మెల్యే హాజరయ్యారు. సహకార సంఘం అధ్యక్షుడిగా ఎంపికైన శంకరప్పను ఎమ్మెల్యే అభినందించారు.

సమాచారం లేకపోతే సమావేశాలకు వచ్చేదెలా?

● ఎంపీటీసీల ఆవేదన

తనకల్లు, జూలై26 (ఆంధ్రజ్యోతి): ముందస్తుగా సమాచారం లేకపోతే మండల సమావేశాలకు వచ్చేదెలా అని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు ప్రశ్నించారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో శనివారం ఎంపీపీ వైవీ కౌసల్య అధ్యతన సర్వసభ్యసమావేశం నిర్వహించారు. సమావేశం ప్రారంభంకాగానే ఎంపీటీసీలు మాట్లాడుతూ తమకు గతంలో మూ డు రోజులు ముందుగానే సమావేశమున్నట్లు నోటీసులందేవని ప్రస్తుతం లేదన్నారు. స్పందించిన ఎంపీడీఓ రామానాయక్ మాట్లాడుతూ సకాలంలో సమాచారం అందిస్తామన్నారు. తమకు యేడాదిగా గౌరవ వేతనం అందలేదని ఎంపీటీసీలు అధికారుల దృష్టికి తెచ్చారు.

సాధ్యమైనన్ని సమస్యల పరిష్కారమే లక్ష్యం

● టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్


అర్జీలు స్వీకరిస్తున్న పరిటాల శ్రీరామ్, కొల్లకుంట అంజినప్ప

ధర్మవరం, జూలై 26(ఆంధ్రజ్యోతి): రాజకీయాలు చేసేందుకో లేక ప్రచారం కోసమో తాము 'మీ సమస్య - మా బాధ్యత' కార్యక్రమాన్ని చేపట్టలేదని టీడీపీ ధర్మవరం నియో జకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ స్పష్టం చేశారు. పట్టణంలోని 17వ వార్డు సంజ యనగర్‌లో ఉన్న బండిసత్రం పాఠశాలలో, గాంధీనగర్‌లోని మున్సిపల్ స్కూల్ వద్ద శనివారం రెండో రోజు నిర్వహించిన గ్రీవెన్స్ కార్యక్రమంలో పరిటాల శ్రీరామ్‌తో పాటు టీడీపీ జిల్లా అధ్యక్షుడు కొల్లుకుంట అంజనప్ప పాల్గొన్నారు. వందలాది మంది వచ్చి తమ సమస్యలను చెప్పుకున్నారు. అనంతరం పరిటాల శ్రీరామ్ మాట్లాడుతూ... తాము తీసుకుంటున్న ప్రతి అర్జీకి పరిష్కారం చూపాలన్నదే తమ లక్ష్యమన్నారు. వాటి పరిష్కారం కోసం మంత్రి సత్యకుమార్‌తో పాటు అధికారులందరితో కలిసి చర్చిస్తామన్నా రు. మరో వైపు మద్యం కుంభకోణంలో పక్కా ఆధారాలతోనే అరెస్టులు జరుగుతున్నాయన్నారు. ఏపీసీడ్స్ రాష్ట్ర కార్పొరేషన్ డైరెక్టర్ కమతం కాటమయ్య, టీడీపీ నియోజక వర్గ క్లస్టర్ ఇన్‌చార్జ్ చింతలపల్లి మహేశ్ చౌదరి, పట్టణ అధ్యక్షుడు పరిశే సుధాకర్, నాయకులు ఫణికుమార్, నాగూర్‌హుస్సేన్, పురుషోత్తంగౌడ్, చింతపులు సుపెద్దన్న, భీమనేని ప్రసాద్‌నాయుడు, మాదవరెడ్డి, అంబటిసనత్, కొత్తపేట ఆది, జింకా పురుషోత్తం, బొట్టుకిష్ట, జింకల రాజన్న, రాంపురంశీన, పఠాన్ బాబూఖాన్, చిన్నూరు లోకేశ్, జిలకర శీన, బాబ్జి, చెలిమి శివరాం, నాగేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మౌలిక వసతులు కల్పిస్తే ఆక్రమణలను తొలగించుకుంటాం

● అధికారులతో నాలుగురోడ్ల కూడలివాసులు

కొత్తచెరువు, జూలై 26(ఆంధ్రజ్యోతి): మౌలిక వసతులు కల్పిస్తే ఆక్రమణలను స్వచ్ఛందంగా తొలగించుకుంటామని నాలుగురోడ్ల కూడలిలోని స్థానికులు అధికారులకు తెలిపారు. మండల కేంద్రంలోని నాలుగురోడ్ల కూడలిలో ఆర్ అండ్‌బీ రోడ్లకు ఇరువైపులా అక్రమ నిర్మాణాలను తొలగించేందుకు ఆర్‌అండ్‌బీ, రెవెన్యూ, పంచాయతీ అధికారులు శనివారం సాయంత్రం శ్రీకారం చుట్టారు. దీంతో స్థానికులు అధికారులను అడ్డగించారు. తమకు ముందుగా మౌలిక వసతులు కల్పిస్తే తామే అక్రమ నిర్మాణాలను తొల గించేందుకు సహకరిసామని మొండికేయడంతో అధికారులు వెనుతిరిగారు. అనంతరం పుట్టపర్తి ఆర్డీఓ సువర్ణ అక్కడికి చేరుకుని అక్రమ నిర్మాణదారులతో మాట్లాడినా స్థానికులు ఒప్పుకోలేదు. ఇదిలాఉండగా పోలీసులు ప్రొటెక్షన్ రాకపోవడంతో అధికారులు అక్రమ నిర్మాణాల తొలగింపు కార్యక్రమాన్ని తాత్కాలికంగా వాయిదా వేశారు.

మూతపడ్డ సులభ్ కాంప్లెక్స్

● ఇబ్బందులు పడుతున్న ప్రజలు

కొత్తచెరువు, జూలై 26 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని పుట్టపర్తి రహ దారి పక్కన బస్‌షెల్టర్ లోపల గ్రామపంచాయతీ ఆధ్వర్యంలో ప్రజల సౌకర్యార్థం సులభ్ కాంప్లెక్సు (టాయిలెట్స్) నిర్మించారు. అయితే నీటి సరఫరా లేక పోవడంతో వారం రోజులుగా అది మూత పడింది. మండల కేంద్రానికి రోజూ పల్లెల నుంచి ఆసుపత్రులకు, బ్యాంక్‌లకు, తహసీల్దార్ కార్యాలయతో పాటు ప్రభుత్వ మండల ఇతర కార్యాలయాల కు ప్రజలు వివిధ పనులపై వస్తుంటారు. ముఖ్యంగా పట్టపర్తిలోని బాబా ఆసుపత్రికి వివిధ ప్రాంతాల నుంచి గర్భిణులు, బాలింతలు, వృద్ధులు కొత్తచెరువు మీదుగా నిత్యం రాకపోకలు సాగిస్తుంటారు. మండల కేంద్రంలో ఉన్న ఒక్క సులబ్ కాంప్లెక్సు కూడా మూతబడడంతో మల, మూత్ర విసర్జనకు టాయిలెట్లు లేకపోవడంతో వారితో పాటు మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. అలాగే వారపు సంతకు వచ్చే మహిళలు, వృద్ధులు, చిన్నారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సులబ్ కాంప్లెక్సును అందుబాటులోకి తీసుకురావాలని ప్రజలు కోరుతున్నారు.


సులభ్ కాంప్లెక్సుకు తాళం వేసిన దృశ్యం

పేదరిక నిర్మూలనపై దృష్టి

● ఇంకోవైపు నియోజకవర్గం అభివృద్ధి
● పీ4,విజన్ 2047పై సమావేశంలో ఎమ్మెల్యే



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పరిటాల సునీత

ధర్మవరం, జూలై 26(ఆంధ్రజ్యోతి): రాప్తాడు నియోజకవర్గంలో ఓ వైపు పేదరిక నిర్మూలన చేస్తూ...ఇంకో వైపు నియోజకవర్గాన్ని అభివృద్ధే లక్ష్యంగా పనిచేద్దామని ఎమ్మెల్యే పరిటాల సునీత అధికారులకు పిలుపు నిచ్చారు. ధర్మవరం ఆర్డీఓ కార్యాలయంలో శనివారం పీ4, రాప్తాడు నియోజకవర్గం స్వర్ణాంధ్రప్రదేశ్ విజన్ 2047పై సమావేశాన్ని ఆమె నిర్వహించారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ రామ్మోహన్, ఆర్డీఓ మహేశ్‌తో పాటు నియోజకవర్గంలోని ఎంపీడీఓలు, తహసీల్దార్లు, ఇతర అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ... నియోజకవర్గం అభివృద్ధి కోసం చేపట్టాల్సిన కార్యక్రమాల గురించి వివరించారు. ఇందులో జీడిపల్లి రిజర్వాయర్ నుంచి సత్యసాయిజిల్లా పరిధిలోని పేరూరు రిజర్వాయర్ వరకు 54 కి.మీ. సాగునీటికాలువ, సోమరవాండ్లపల్లి రిజర్వాయర్ నిర్మాణం ప్రధానమని అన్నారు. చెన్నేకొత్తపల్లి, పులేటిపల్లి, నాగసముద్రం గ్రామాల మధ్య నాలుగు వేల ఎకరాలు బీడు భూముల్లో హార్టికల్చర్ లేక సోలార్ హబ్ ఏర్పాటుచేయాలన్నారు. కనగానపల్లి మండంలో సోలార్, పవన విద్యుత్ పరిశ్రమలు, మండలంలో దాదులూరులో జాతీయ రహదారి వద్ద ప్రభుత్వ భూముల్లో పరిశ్రమలు నెలకొల్పాలన్నారు. గోరుచిక్కుడు పరిశ్రమ కోసం నిర్మించిన నిర్మాణాలను ఉపయోగంలోకి తేవాలన్నారు. రామగిరి బంగారు గనులను తెరిపించాలని, రామగిరి, కనగానపల్లి, చెన్నే కొత్తపల్లి మండలాల్లో తాగునీటి పథకాన్ని మంజూరు చేయాలన్నారు. రాప్తాడు ఆటోనగర్‌లో మౌలిక వసతులు కల్పించాలని, పండమేరు వాగుపై బ్రిడ్జి, నడిమివంక రక్షణ గోడ నిర్మించాలని, రైతులకు, చేతి వృత్తుల వారికి ఉపయోగపడేలా పలు అభివృద్ధి ప్రణాళికలను వివరించారు.

'సీఎస్‌ఆర్‌లో రూ.9 కోట్లు నిధులు మిగులు'

ఆంధ్రజ్యోతి స్పందన

నంబులపూలకుంట, జూలై26 (ఆంధ్రజ్యోతి) : సామాజిక బాధ్యతకు తూట్లు అన్నవార్త ఆంధ్రజ్యోతి దినపత్రికలో శనివారం ప్రచురిత మైన విషయం విదితమే. ఈ వార్తకు స్పందిం చిన ఎఫ్‌పీసీ ప్రాజెక్టు డైరెక్టర్ (ఎన్‌ఆర్‌డీసీ ఏపీ) శివశంకర్‌నాయుడు మాట్లాడుతూ రూ.9 కోట్లు సీఎస్‌ఆర్ నిధులు మిగులు ఉన్నాయన్నారు. సీఎస్‌ఆర్ నిధులతో నిర్మించిన రోడ్లకు గ్రామంలో వీధులు వెడల్పులేని కారణంగా మురుగునీటి కాలువలు నిర్మించలేదన్నారు. సోలార్ విద్యుత్ దీపాలు వెలగడంలేదని ఎన్‌ఆర్‌డీసీఏపీకి లేఖ రాశామన్నారు.. త్వరలో వీధి దీపాలు వెలగడానికి కృషి చేస్తామన్నారు. ఆర్వోప్లాంట్లు నిర్మాణ దశలో ఉన్నాయని, ఎగువతూపల్లి ఎస్సీ కాల నీలో స్థలం ఎవరూ ఇవ్వకపోవడంతో చెరువు ప్రాంతంలో ఆర్వో ప్లాంటు నిర్మాణం చేపట్టామన్నారు. ఎస్సీకుంట, కొత్తపల్లి, పెడబల్లి రూ. రెండుకోట్లు టెండర్ దశలో ఉన్నాయని, మిగిలిన సీఎస్‌ఆర్ ని. దులతో ఎమ్మెల్యే, ప్రజల సహకారంతో అభివృద్ధి పనులు చేపడతామని ఆయన తెలిపారు.

తాగునీటి సమస్య పరిష్కారం

ముదిగుబ్బ, జూలై 26(ఆంధ్రజ్యోతి): పది నెలల నుంచి జీతాలు చెల్లించలేదని ఆర్‌డబ్ల్యూఎస్ కార్మికులు సమ్మె నిర్వహించారు. ముదిగుబ్బలోని కొన్ని ప్రాంతాల వారు 30 రోజుల నుంచి తాగునీటి సౌకర్యం లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడ్డారు. దీంతో టీడీపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ పరిటాల శ్రీరామ్ ఆదేశాల మేరకు పార్టీ మండల కన్వీనర్ కరణం ప్రభాకర్, నాయకులు కోట్ల బాబి శనివారం సంపు వద్దకు వెళ్లి ఆర్‌డబ్ల్యూఎస్ కార్మికులతో చర్చించారు. త్వరలోనే జీతాలను చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో కార్మికులు సమ్మె విరమించి తాగునీరు సరఫరా చేశారు. ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ ప్రసాద్, టీడీపీ కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

పట్నం చెరువు పరిశీలన

కదిరి అర్బన్, జూలై 26(ఆంధ్రజ్యోతి): మండలంలోని పట్నం చెరువును జాతీయ మానవ హక్కుల కమిషన్ సభ్యురాలు విజయభారతి పరిశీలించారు. పది సంవత్సరాల నుంచి సొసైటీ ఆధ్వర్యంలో ఇక్కడ చేపల చెరువు కొనసాగుతోంది. అయితే ఆయకట్టుకు నీరు విడుదల చేయకపోవడంతో 570 ఎకరాలు బీళ్లుగా మారాయి. దీనిపై ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేసినా, పరిష్కారం కాకపోవడంతో మానవ హక్కుల సంఘానికి ఫిర్యాదు చేశారు. స్పందించిన మానవహక్కుల సంఘం సభ్యురాలు శనివారం పట్నం చెరువును పరిశీలించి, గ్రామసభ నిర్వహించారు. చెరువు ఉమ్మడి ఆస్తి అని, చెరువును పంచాయతీకి అప్పగిస్తే, పంచాయతీకి ఆదాయం సమకూరుతుందని సూచించారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ధర్మవరం విద్యార్థి


విద్యార్థిని అభినందిస్తున్న ప్రిన్సిపాల్

ధర్మవరం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో ద్వితీయ సంవత్సరం సీఈసీ చదువుతున్న నిఖిల్‌కుమార్ రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు ఎంపికైనట్టు కళాశాల ప్రిన్సిపాల్ ప్రశాంతి తెలిపారు. ఆ విద్యార్థిని శనివారం కళాశాలలో ప్రిన్సిపాల్, అధ్యాపకులు అభినందించారు. ఐదు రోజుల క్రితంఅనంతపురం న్యూటౌన్ జూనియర్ కళాశాలలో జరిగిన బాల్‌బ్యాడ్మింటన్ అండర్-19 విభాగంలో ప్రతిభ కనబరచి రాష్ట్రస్థాయి పోటీలకు ఉమ్మడి అనంతపురం జిల్లా జట్టు తరపున నిఖిల్‌కుమార్ ఎంపికైనట్లు తెలిపారు.

ఘనంగా ఎల్లో కలర్ డే


ఎల్లో కలర్ డేలో పాల్గొన్న విద్యార్థులు

ధర్మవరం, జూలై 26(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని కొత్తపేటలో ఉన్న శ్రీఉషోదయ పాఠశాలలో ఎల్లో కలర్ డేని శనివారం ఘనంగా నిర్వహించారు.పసుపు పండ్లు, పసుపు కూరగాయల ప్రాధాన్యాన్ని పాఠశాల కరస్పాండెంట్ చాంద్‌బాషా వివరిం చారు. పాఠశాల డైరెక్టర్లు పోలా ప్రభాకర్, సుబ్బారావు, శంషాద్ బేగం, హెచ్ఎం నాగభూషణం, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కళాశాలలో ఘనంగా ఫ్రెషర్స్ డే

ధర్మవరం, జూలై 26(ఆంధ్రజ్యోతి): విద్యతోనే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందని వక్తలు కలవల మహేశ్, డోలా పెద్దిరెడ్డి విద్యార్థులకు సూచించారు. పట్టణంలోని సాయి కృప జూనియర్ కళాశాలలో శనివారం ఫ్రెషర్స్ డేని ద్వితీయ సంవత్సరం విద్యార్థులు ఉల్లాసంగా నిర్వహించారు. ముఖ్య అతిథులుగా కలవల మహేశ్, డోలా పెద్దిరెడ్డి హాజరైమాట్లాడారు. అనంతరం విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు, డ్యాన్స్‌లు అందరినీ ఆకట్టుకున్నాయి. కళాశాల ప్రిన్సిపాల్ పురుషోత్తంరెడ్డి, డైరెక్టర్లు భగవంతరెడ్డి, చంద్రశేఖర్, అధ్యాపకులు పాల్గొన్నారు.

అంజన్నకు శ్రావణశోభ

ఉదయం నుంచి ప్రత్యేక పూజలు... కిటకిటలాడిన ఆలయాలు



పెనుకొండలో తమలపాకులతో అలంకరణ



గుడిబండలో కొంకల్లు ఆంజనేయస్వామి

శ్రావణమాసం మొదటి శనివారం కావడంతో ఆంజనేయస్వామి ఆలయాలు శోభను సంతరించుకున్నాయి. ప్రసిద్ధిచెందిన ఆలయాల వద్ద భక్తుల రద్దీని అనుసరించి ఏర్పాట్లను ఆయా ఆలయ కమిటీలు చేశాయి. ఉదయం నుంచి భక్తులు ఆంజనేయస్వామి దర్శనానికి పోటెత్తారు. స్వామివారికి ప్రత్యేక పూజలు, అభిషేకాలు నిర్వహించిన అనంతరం మహామంగళహారతి ఇచ్చారు. అనంతరం తీర్థప్రసాదాల వినియోగం చేశారు. భక్తుల స్వామివారిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. పెనుకొండ, గోరంట్ల, మడకశిర తదితర ప్రాంతాల్లో శ్రావణ శనివారం సందర్భంగా పూజలు జరిగాయి. మడకశిరలోని మిట్టబండ ఆంజనేయస్వామి ఆలయంలో స్వామివారికి సుప్రభాత సేవతో పూజలు ప్రారంభమయ్యాయి. తమలపాకులతో స్వామివారిని అంగరంగ వైభవంగా అలంకరణ చేశారు.

- ఆంధ్రజ్యోతి, న్యూస్‌నెట్‌వర్క్



ప్రత్యేక పూజలు అందుకొంటున్న మిట్టబండ ఆంజనేయస్వామి

పావగడలో...



శనైశ్చర్యుడికి ప్రత్యేక అలంకరణ

పావగడ, జూలై 26(ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధిచెందిన పావగడలో శ్రావణ శనివారం సందర్భంగా ప్రత్యేక పూజలను స్వర్ణ శనైశ్చరుడికి నిర్వహించారు. ఉదయం 4 గంటల నుంచి స్వామివారికి తైలాభిషేకం, నవగ్రహపూజ చేశారు. సీతారాంబకు కుంకుమార్చనతో పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామివారికి ప్రత్యేక అలంకరణ చేశారు. భక్తులు స్వామి, అమ్మవారికి దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు.



దర్శనమిస్తున్న సీతారాంబ

ప్లాస్టిక్ నిషేధంపై కఠినంగా వ్యవహరిస్తాం

పంచాయతీ ఈఓ



దుకాణదారులకు హెచ్చరికలు జారీచేస్తున్న అధికారులు

గోరంట్ల, జూలై 26 (ఆంధ్రజ్యోతి): ప్లాస్టిక్ కవర్ల నిషేధంపై కఠినంగా వ్యవహరిస్తామని పంచాయతీ ఈఓ సుబ్రహ్మణ్యం శనివారం వ్యాపారులను హెచ్చరించారు. గతంలో నోటీసులు జారీ చేసినా కొందరు ప్లాస్టిక్ కవర్లను వాడుతుండటంతో ఆయన మండిపడ్డారు. పట్టణంలోని హోల్‌సేల్ దుకాణదారులు, పాల డెయిరీ వద్దకు వెళ్లి తీవ్రస్థాయిలో హెచ్చరికలు జారీ చేశారు. ఆదేశాలు జారీ చేసినా ప్లాస్టిక్ కవర్లను వాడుతున్నారని, ఇక వాడితే సహించేది లేదని, జరిమానా విధిస్తామన్నారు.

ప్రతి ఒక్కరూ పరిశుభ్రతను పాటించాలి

కేంద్ర బృందం సభ్యులు



ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలిస్తున్న సభ్యులు

పరిగి, జూలై 26(ఆంధ్రజ్యోతి): పరిశుభ్రతను ప్రతిఒక్కరూ పాటించాలని కేంద్ర బృంద సభ్యులు సూచించారు. శనివారం కేంద్ర బృంద సభ్యులు రామాంజినేయులు, అనంత పెద్దరెడ్డిపల్లిలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని, కొడిగెనహళ్లిలోని ఆయుష్మాన్ ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. చెత్తకుండీలు, వాటర్‌ట్యాంకు తదితరవాటిని పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ భవనాల్లో పరిశుభ్రతను తప్పకుండా పాటించాలన్నారు. కేంద్ర ప్రభుత్వం స్వచ్ఛతపై దృష్టిసారిస్తోందన్నారు. అనంతరం పరిగి పీహెచ్‌సీని, సచివాలయాన్ని సందర్శించారు. వారి వెంట డిప్యూటీ ఎంపీడీఓ భాస్కర్, పంచాయతీ కార్యదర్శి అరుణ, నీటి పారుదలశాఖ అధికారి ప్రత్యూష, కోఆర్డినేటర్ మల్లికార్జున తదితరులు పాల్గొన్నారు.

లేపాక్షి శిల్పకళ అద్భుతం

కర్ణాటక రాష్ట్ర గవర్నర్ వ్యక్తిగత కార్యదర్శి మెహతా



ఏడు శిరస్సుల నాగేంద్రుడి వద్ద మెహతా, కుటుంబ సభ్యులు

లేపాక్షి, జూలై 26(ఆంధ్రజ్యోతి): ప్రపంచ ప్రసిద్ధిగాంచిన దుర్గా వీరభద్రస్వామి ఆలయంలోని శిల్పకళలు అద్భుతమని కర్ణాటక రాష్ట్ర గవర్నర్ వ్యక్తిగత కార్యదర్శి పంకజ్‌కుమార్ మెహతా అన్నారు. శనివారం ఆయన తన కుటుంబ సభ్యులతో కలిసి ఆలయాన్ని సందర్శించారు. ఆలయ గైడ్ రఘు ఆలయ విశిష్టతను వివరించారు. ఏడు శిరస్సుల నాగేంద్రుడు, అర్ధాంతరంగా ఆగిన కల్యాణమండపం, సీతాదేవి పాదం, వేలాడే స్తంభాన్ని సందర్శించి సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం దుర్గా, వీరభద్రస్వాములకు ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు అందుకున్నారు. ఆయన మాట్లాడుతూ ఆలయ శిల్ప, చిత్రకళలు అద్భుతంగా ఉన్నాయని ఆనాటి శిల్పుల నైపుణ్యాన్ని కొనియాడారు.

ఆటో టైరు, బ్యాటరీ చోరీ



టైరు, బ్యాటరీ చోరీకి గురైన ఆటో

సోమందేపల్లి, జూలై 26(ఆంధ్రజ్యోతి): ఇంటి ముందు ఉంచిన ఆటో టైరు, బ్యాటరీ శుక్రవారం రాత్రి చోరీకి గురయ్యాయి. వినాయక్‌నగర్‌కు చెందిన గంగాధర్ రాత్రి ఇంటిముందు ఉంచాడు. ఉదయం లేచి చూసేసరికి ఆటో ముందు టైరు, బ్యాటరీ చోరీకి గురయ్యాయి. బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు.

భక్తి శ్రద్ధలతో ఏడు శనివారాల వ్రతం



ఏడు శనివారాల వ్రతంలో పాల్గొన్న మహిళలు

ధర్మవరం, జూలై 26(ఆంధ్రజ్యోతి): ఏడు శనివారాల వ్రతాన్ని పట్టణంలోని శ్రీనివాసనగర్‌లో వెలసిన లక్ష్మీవెంకటేశ్వర స్వామి ఆలయంలో శనివారం ఘనంగా నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో 40 మంది మహిళలు వ్రతాన్ని ఆచరించారు.

వైభవంగా సత్యసాయి రథోత్సవం

చిలమత్తూరు, జూలై 26(ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా శత జయంతి ఉత్సవాల్లో భాగంగా శనివారం మండల కేంద్రంలో రథోత్సవం అత్యంత వైభవంగా జరిగింది. సత్యసాయి సేవా సంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి మహిళలు, సత్యసాయి భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. రథంలో సాయి చిత్రపటాన్ని ఊరేగించారు. ఈ సందర్భంగా మహిళలు మంగళ హారతులు పట్టారు. రథం వెంట సాయి కీర్తలను ఆలపిస్తూ రథాన్ని ముందుకు నడిపించారు. ఈ సందర్భంగా సత్యసాయి సంస్థ ప్రతినిధులు సాయి సూక్తులను ప్రజలకు చదివి వినిపించారు.

గోరంట్ల, (ఆంధ్రజ్యోతి): పుట్టపర్తి సత్యసాయిబాబా రథోత్సవాన్ని గోరంట్ల పట్టణంలో శనివారం ఘనంగా నిర్వహించారు. రథం చిలమత్తూరు మండలం నుంచి గోరంట్లకు వచ్చింది. మంగళవాయిద్యాలు, సాంస్కృతిక కార్యక్రమాల నడుమ రథోత్సవం సాగింది. హరిగోవింద సేవా సమితి గోపీ స్వామి ఆధ్వర్యంలో సాంస్కృతిక కార్యక్రమాలు



రథోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

సాగాయి. కార్యక్రమంలో సత్యసాయి భజన మండలి నాయకులు విజయలక్ష్మీ, శివారెడ్డి, దేవరాజుస్వామి పాల్గొన్నారు.

దరఖాస్తు చేసుకోండి

చిలమత్తూరు, జూలై 26(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి రుణాలు అందించేందుకు మైనార్టీల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ఎంపీడీఓ రమణమూర్తి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ప్రభుత్వం ఏపీ ఓబీఎంఎంఎస్ వెబ్ సైట్ ద్వారా దరఖాస్తు చేసుకునేందుకు అవకాశం కల్పించిందన్నారు.

జాబితాలో తప్పులను సరిచేయండి: కన్వీనర్

పెనుకొండ, జూలై 26(ఆంధ్రజ్యోతి): బంగారు కుటుంబం లబ్ధిదారుల ఎంపికలో ఎలాంటి తప్పులైనా ఉంటే సరిచేసి అర్హులకు న్యాయం జరిగేలా చూడాలని టీడీపీ మండల కన్వీనర్ శ్రీరాములు సూచించారు. శనివారం పీ-4 సర్వేవార్డు సభను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వేలో ఎంపిక చేసిన లబ్ధిదారుల జాబితాను పరిశీలన చేయడానికి వార్డుసభలు నిర్వహించి ఆ జాబితాను సచివాలయ నోటీసు బోర్డులో ప్రదర్శించామన్నారు. అందులో తప్పులుంటే వాటిని సరిచేసి అర్హులకు న్యాయం జరిగేలా చూడాలన్నారు. వాటితో పాటు కొత్త కుటుంబాలను ఎంపికచేసి జాబితాలో నమోదు చేయించాలన్నారు.

'ఎయిడ్స్ రహిత సమాజస్థాపనకు కృషిచేద్దాం'

పెనుకొండ, జూలై 26(ఆంధ్రజ్యోతి): ఎయిడ్స్ రహిత సమాజ స్థాపనకు కృషి చేద్దామని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ సుదర్శన్ సూచించారు. శనివారం కళాశాలలో ఎయిడ్స్ నివారణపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఎయిడ్స్ రావడానికి కారణాలు, నివారణ తదితర విషయాలను ప్రిన్సిపాల్ సుదర్శన్ వివరించారు. అనంతరం రెడ్‌రిబ్బన్ కమిటీని ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ప్రిన్సిపాల్ సుదర్శన్, నోడల్ ఆఫీసర్‌గా జయప్రకాశ్‌తోపాటు కమిటీ సభ్యులను ఎంపిక చేశారు.

ఏఐఎస్ఎఫ్ కమిటీ ఏర్పాటు

హిందూపురం, జూలై 26(ఆంధ్రజ్యోతి): ఏఐఎస్ఎఫ్ విద్యార్థి సంఘం నూతన కమిటీని శనివారం ఎన్నుకున్నారు. సప్తగిరి కళాశాలలో 21మందితో కమిటీ ఎంపిక చేసినట్లు ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు నరసింహమూర్తి తెలిపారు. ఈ కమిటీ కళాశాల అధ్యక్షుడు హేమంత్, కార్యదర్శి గౌరీశంకర్, ఉపాధ్యక్షులుగా అభిలాష్, మనోజ్, పవన్, అబ్దుల్, సభ్యులను ఎన్నుకున్నారు. కార్యక్రమంలో పట్టణ కార్యదర్శి చంద్రశేఖర్, సహాయ కార్యదర్శి భరత్ పాల్గొన్నారు.

'ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్ఏను పునరుద్ధరించండి'

రొద్దం, జూలై 26(ఆంధ్రజ్యోతి): ఆర్డీటీ సంస్థకు ఎఫ్‌సీఆర్ఏను పునరుద్ధరించాలని విద్యార్థులు అమిత్‌షాకు పోస్టుకార్డుల ద్వారా విన్నవించారు. శనివారం రొద్దం మండల పరిధిలోని పెద్దగువ్వలపల్లి జడ్పీహైస్కూల్, రెడ్డిపల్లి, తాడంగిపల్లి ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో విద్యార్థులు పోస్టుకార్డుల ఉద్యమాన్ని చేపట్టారు. పేద విద్యార్థుల కోసం ఆర్డీటీ చేయూతనిస్తోందని, అలాంటి సంస్థకు రెన్యూవల్ చేయకపోవడం దారుణమన్నారు. వెంటనే చేయలని కోరారు. కార్యక్రమంలో ఆర్డీటీ సహాయకులు గోపాల్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

కేఎస్ ఆర్టీసీ బస్సు ఢీకొని యువకుడికి గాయాలు

మడకశిర రూరల్, జూలై 26(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని గౌరిపురం వద్ద శనివారం ద్విచక్రవాహనాన్ని కేఎస్ ఆర్టీసీ బస్సు ఢీ కొనడంతో యువకుడికి తీవ్రగాయాలయ్యాయి. అమిదాలగొంది గ్రామానికి చెందిన నరసింహమూర్తి ద్విచక్రవాహనంలో పావగడ నుంచి స్వగ్రామానికి వస్తుండగా గౌరీపురం వద్ద బైక్ సిగ్నల్ వేసి పెట్రోల్ కోసం రోడ్డు దాటుతుండగా పావగడ నుంచి బెంగుళూరు వెళ్తున్న కేఎస్ ఆర్టీసీ బస్సు ఢీ కొంది. దీంతో నరసింహమూర్తికి తీవ్రగాయాలు కావడంతో మడకశిర ఆసుపత్రితో ప్రథమ చికిత్స నిర్వహించి మెరుగైన వైద్యం కోసం బెంగళూరుకు తరలించారు. బస్సును పోలీసు స్టేషన్‌కు తీసుకెళ్లారు.

విద్యుత్ సమస్యను తీర్చండి

మండల సర్వసభ్య సమావేశంలో సభ్యుల డిమాండ్

అగళి, జూలై 26(ఆంధ్రజ్యోతి): విద్యుత్ సమస్య వేధిస్తోందని, వెంటనే సమస్యను పరిష్కరించాలని సభ్యులు డిమాండ్ చేశారు. ఏఈ లేకపోవడంతోనే సమస్య తలెత్తిందని, వెంటనే ఏఈని నియమించాలని కోరారు. స్థానిక మండలపరిషత్ కార్యాలయంలో శనివారం ఎంపీపీ రేణుక కామరాజు అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జడ్పీటీసీ ఉమేష్ మాట్లాడుతూ తల్లికి వందనం కింద నిధులు జమచేయడం పట్ల ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. ఏడీ రఘు మాట్లాడుతూ 71 మంది రైతులకు ట్రాన్స్‌ఫార్మర్‌లు ఇచ్చామన్నారు. ఏపీఓ మంజునాథ్ మాట్లాడుతూ 3వేల మంది కూలీలు పనులు చేస్తున్నారని, 70 గోకులం షెడ్లు మంజూరయ్యాయన్నారు. 187 మంది రైతులు 200ఎకరాల్లో హార్టికల్చర్ కింద మొక్కలు పెంచడానికి చర్యలు తీసుకున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో మార్కెట్‌యార్డ్ చైర్మన్ గురుమూర్తి, ఎంపీడీఓ రాజేంద్రప్రసాద్, తహసీల్దార్ సుబ్బారావు, సింగిల్‌విండో అధ్యక్షులు కుమారస్వామి, మార్కెట్‌యార్డ్ డైరెక్టర్ శిల్ప కెంచ యాదవ్, వార్డన్ సిందర్‌బాషా, ఎంఈఓ చంద్రశేఖర్‌నాయుడు, హౌసింగ్ ఏఈ కిషోర్, ఏపీఎం సురేష్, సూపర్‌వైజర్ లీలావతి, సింగిల్‌విండో డైరెక్టర్ శివప్ప, ముద్దరాజు, రామక్రిష్ణ తదితరులు పాల్గొన్నారు.

బొడ్రాయికి పూజలు



బొడ్రాయికి పూజలు నిర్వహిస్తున్న గ్రామస్థులు

మడకశిర రూరల్, జూలై 26(ఆంధ్రజ్యోతి): వర్షాలు బాగా కురుసి పంటలు సమృద్ధిగా పండాలంటూ జమ్మానిపల్లి గ్రామస్థులు శనివారం గ్రామంలోని బొడ్రాయికి జలంతో అభిషేకం చేశారు. 108 బిందెలతో బొడ్రాయికి అభిషేకం చేసినట్లు గ్రామస్థులు తెలిపారు.

నిధులు విడుదల

అగళి, జూలై 26(ఆంధ్రజ్యోతి): మండలానికి సంబంధించి 10 వాటర్ ట్యాంకర్ల నిర్మాణానికి రూ.4 కోట్లు నిధులు విడుదలైనట్లు ఆర్‌డబ్ల్యూఎస్ ఇంజనీర్ విజయ్‌కుమార్ తెలిపారు. అగళి హళ్లికెర కోడిపల్లి, ముక్కడంపల్లి, పి బ్యాడిగిర, హెచ్‌డిహళ్లి, మధుడి, రామనపల్లి, దాసిగౌడనహళ్లి గ్రామాలకు వాటర్ ట్యాంకులు మంజూరయ్యాయని, త్వరలోనే ప్రారంభిస్తామన్నారు.

పరామర్శ

గుడిబండ, జూలై 26(ఆంధ్రజ్యోతి): ఎలుగుబంటి దాడిలో గాయపడ్డ ఎస్‌రాయాపురానికి చెందిన భూతరాజును టీడీపీ నాయకులు శనివారం పరామర్శించారు. మండల కన్వీనర్ లక్ష్మీనరసప్ప, సింగిల్‌విండో అధ్యక్షుడు మద్దనకుంటప్ప, జిల్లా ఎస్సీసెల్ అధ్యక్షుడు మంజునాథ్, నాయకులు శివకుమార్, ప్రకాశ్ భూతరాజును పరామర్శించారు.

వన్నంపల్లిలో చోరీ

పరిగి, జూలై 26(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని వన్నంపల్లిలో రైతు శ్రీనివాసరెడ్డి ఇంట్లో శుక్రవారం చోరీ జరిగినట్లు ఎస్ఐ రంగడు యాదవ్ తెలిపారు. తిరుపతికి దర్శనం కోసం వెళ్లగా గమనించిన దుండగులు తాళం పొగలకొట్టి బీరువాలో ఉన్న రూ.40వేల నగదు తీసుకెళ్లారని, కేసు నమోదు చేశామన్నారు.

బాల్య వివాహాల నిర్మూలన అందరి బాధ్యత

● సీడీపీఓ నాగమల్లేశ్వరి



మాట్లాడుతున్న సీడీపీఓ నాగమల్లేశ్వరి

మడకశిర టౌన్, జూలై 26(ఆంధ్రజ్యోతి): బాల్య వివాహాల బాధ్యత అందరిది అని గ్రామస్థాయిలో బాల్య వివాహాలను అరికట్టేందుకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని ఐసీడీఎస్ సీడీపీఓ నాగమల్లేశ్వరి అన్నారు. శనివారం పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయంలో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ప్రొటెక్షన్ అధికారులు నాగలక్ష్మి, మురళి తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా సీడీపీఓ మాట్లాడుతూ బాల్య వివాహాల నిర్మూలన కోసం కమిటీలు ఏర్పాటు చేయడం జరిగిందని, అవి బాధ్యతగా పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్ జగన్నాథ్, 26 పంచాయతీల వీఆర్‌ఓలు, కార్యదర్శులు, అంగన్‌వాడీ కార్యకర్తలు, మహిళ పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

గుడ్డం కోనేరు పరిశీలన



గుడ్డం కోనేరును పరిశీలిస్తున్న చైర్మన్ రమేష్, ఎమ్మెల్యే పీఏ వీరయ్య

హిందూపురం, జూలై 26(ఆంధ్రజ్యోతి): వినాయక నిమజ్జనం కోసం గుడ్డం కోనేరును శనివారం మున్సిపల్ చైర్మన్ రమేష్, ఎమ్మెల్యే పీఏ వీరయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా సెప్టెంబరు మొదటివారంలో వినాయక నిమజ్జన ఉంటుందని, కోనేరులో నీరు నింపి భక్తుల కోసం తగు ఏర్పాట్లు చేయాలని అధికారులకు సూచించారు.

మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు అవకాశం

ప్రభుత్వం కల్పించిన కుట్టుమిషన్ శిక్షణ కేంద్రంలో శిక్షణ పొందితే ఆ తరువాత మహిళలు ఆర్థికంగా ఎదగడానికి అవకాశం ఉంటుందని హిందూపురంమున్సిపల్ చైర్మన్ రమేష్ అన్నారు. శనివారం సూగూరు కుట్టుమిషన్ కేంద్రంలో శిక్షణ పూర్తి చేసుకున్న సందర్భంగా ఏర్పాటుచేసిన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం మహిళల కోసం కుట్టుశిక్షణ కేంద్రం ఏర్పాటుచేసి ఉచితంగా కుట్టుమిషన్ ఇవ్వడం జరుగుతుందన్నారు. నియోజకవర్గానికి 5వేల మంది మహిళలకు ఇవ్వడం జరుగుతోందని, ఇందుకోసం పది శిక్షణ కేంద్రాలను ఏర్పాటుచేయడం జరిగిందన్నారు. శిక్షణ పూర్తీచేసుకున్నవారికి ఎమ్మెల్యే చేతులమీదుగా సర్టిఫికెట్ ఇవ్వడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో కురుబ కార్పొరేషన్ డైరెక్టర్ పరిమళ, నాయకులు శివ, వెంకటలక్ష్మీ, విజయలక్ష్మీ, హనుమంతు, టీఎంసీ గంగులయ్య తదితరులు పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమ పథకాలు

తొలి అడుగులో టీడీపీ నాయకులు



కరపత్రాలు పంపిణీ చేస్తున్న శ్రీనివాసరావు, నాయకులు

హిందూపురం, జూలై 26 (ఆంధ్రజ్యోతి): అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యమని నియోజకవర్గ టీడీపీ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు అన్నారు. శనివారం హిందూపురం మండలం చౌళూరు గ్రామంలో సుపరిపాలన తొలిఅడుగు కార్యక్రమంలో భాగంగా ఇంటింటికి వెళ్లి అందుతున్న సంక్షేమ పథకాలపై ఆరాతీశారు. సమస్యలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో అర్హులైన ప్రతి ఒక్కరికీ పింఛన్లు, రేషన్‌కార్డులు ఇవ్వడం జరుగుతుందన్నారు. ఇప్పటికే ఎన్‌ఆర్‌జీఎస్ కింద రోడ్లు, డ్రైనేజీలు నిర్మించారని వచ్చే యేడాదిలోపు ప్రతి పల్లెకు రోడ్డు నిర్మించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెట్‌యార్డ్ చైర్మన్ అశ్వర్థనారాయణరెడ్డి, వాల్మీకి కార్పొరేషన్ డైరెక్టర్ బేవనహళ్లి ఆనంద్, కన్వీనర్ రాము, నాయకులు ఆదినారాయణ, ప్రదీప్, నాగన్న, రామాంజినేయులు, ఉమాశంకర్‌రెడ్డి, శ్రీరాములు, అంజి, రమేష్, తదితరులు పాల్గొన్నారు.



చిలమత్తూరులో..

చిలమత్తూరు, (ఆంధ్రజ్యోతి): ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజలకు సుపరిపాలన అందుతోందని మండల కన్వీనర్ శ్రీనివాసులు పేర్కొన్నారు. శనివారం మండలంలోని సోమఘట్ట పంచాయతీ కొక్కోవాండ్లపల్లిలో సుపరిపాలనతో తొలిఅడుగు నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటింటికీ వెళ్లి ప్రతి కుటుంబానికి అందుతున్న లబ్ధిని వివరించారు. అర్హులుగా ఉంటూ ప్రభుత్వ పథకాలు అందకపోతే వాటిని వెంటనే అందే విధంగా చర్యలు తీసుకుంటామని ఈ సందర్భంగా ప్రజలకు హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో నాయకులు తిప్పారెడ్డి, బేకరీ గంగాధర్, రంగప్ప, విశ్వనాథరెడ్డి, రామాంజి తదితరులు ఉన్నారు.

సమాచార హక్కుచట్టంపై అవగాహన

హిందూపురం, జూలై 26(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ మహిళా డిగ్రీకళాశాలలో సమాచార హక్కుచట్టంపై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్, రాజనీతిశాస్త్ర విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో జరిగినకార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ వెంకటేశులు మాట్లాడుతూ సమాచార హక్కుచట్టంపై యువత అవగాహన కలిగి ఉండాలన్నారు. సమాచారాన్ని నిర్ణీత గడువులోపు ఇవ్వాల్సి ఉంటుందని, అలా ఇవ్వని పక్షంలో సమాచారం అడిగిన వ్యక్తి అప్పీలుకు వెళ్లే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో అధ్యాపకులు రవినాయక్, ఎన్ఎస్ఎస్ పీఓ, విద్యార్థినులు పాల్గొన్నారు.

అమరులకు ఘన నివాళి

హిందూపురం, జూలై 26(ఆంధ్రజ్యోతి): కార్గిల్ యుద్ధంలో అసువులు బాసిన అమరవీరులకు నివాళులు అర్పించారు. కార్గిల్‌దివాస్ పురస్కరించుకుని శనివారం రాత్రి పట్టణంలోని రైల్వే స్టేషన్‌వద్ద ఉన్న అమరవీరుల స్థూపంవద్ద ప్రజాసంఘాల నాయకులు నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా దేశం కోసం ప్రాణత్యాగాలు చేసిన అమరుల కుటుంబాలకు రుణపడి ఉండాలన్నారు. కార్యక్రమంలో లైఫ్‌వరల్డ్ ఉదయ్‌కుమార్, శ్రీరాములు, మింటు, గాంధీ, అబ్రహం, నారాయణ, చంద్ర తదితరులు పాల్గొన్నారు.